ప్రజాశక్తి

సోమవారం 16 అక్టోబర్ 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

జిజిహెచ్‌కు నిధుల కొరత



- ఎంసిహెచ్ భవనసముదాయంలో మౌలిక వసతులపై నీలినీడలు
- రూ.20 కోట్లు అవసరం అని అధికారుల అంచనా
- ప్రభుత్వం మంజూరు చేస్తుందా? లేదా? అనే సంశయం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో మాత శిశుసంరక్షణ విభాగం (ఎంసిహెచ్) కోసం ఎన్‌ఆర్‌ఐల సహకారంతో నిర్మిస్తున్న బహుళంతస్తుల భవనంలో మౌలిక వసతులు, వైద్య పరికరాలు, అధునాతన యంత్రాల కొనుగోలుకు నిధుల కొరత వెంటాడుతోంది. ఇందుకోసం నిధులు ప్రభుత్వం ఇస్తుందా? లేదా? అనే సంశయం అధికారవర్గాల్లో ఏర్పడింది. మాత శిశుసంరక్షణ విభాగం కోసం అధునాతన వసతులతో రూ.80 కోట్లతో 600పడకల సామర్థ్యంతో ఈ భవన సముదాయం నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి కల్లా పూర్తి చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. రూ.80 కోట్లు పూర్తిగా గుంటూరు మెడికల్ కళాశాల పూర్వవిద్యార్థులే (జింఖానా) భరిస్తున్నారు. గైనకాలజీ, ప్రసూతి విభాగం, చిన్న పిల్లల సంరక్షణ, శస్త్రచికిత్సల విభాగం,వివిధ రకాల పరీక్షలు మొత్తం ఈ భవనంలోనే ఏర్పాటు కానున్నాయి. ప్రస్తుతం ఉన్న పాత భవనంలో ఉన్న ఈ విభాగంలో గర్భిణీలు సైతం మంచానికి ఇద్దరిని ఉంచుతున్నారు. ఈ పరిస్థితి నుంచి బయట పడేందుకు సెల్లార్‌తో పాటు మరో ఐదు అంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. ఈ సముదాయం సిద్ధం అయితే ఆస్పత్రిలో ప్రస్తుతం గర్భిణీలకు కష్టాలు తొలగుతాయని భావిస్తున్నారు.

అయితే ఈ భవనం ఎప్పటికి అందుబాటులోకి తీసుకురాగలరన్న అంశంపై అనేకసందేహాలు నెలకొన్నాయి. నూతన భవన సముదాయంలోకి ఫర్నీచరు, వైద్య పరికరాలు, అధునాతన

2లో



రాస్తారోకోలో మెడకు కొడవలి పెట్టుకుని నిరసన తెలుపుతున్న రైతు

సాగునీటి కోసం రైతుల రాస్తారోకో

- వరిపైరు ఎండిపోతోందని కొడవలిని మెడకు పెట్టుకుని రైతు వినూత్న నిరసన
- కలెక్టర్ హామీతో ఆందోళన విరమణ

వార్త మెయిన్‌లో



సదస్సులో మాట్లాడుతున్న జెవివి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ఆరోగ్యాన్ని ప్రాథమిక హక్కుగా గుర్తించాలి

- ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు, సిబ్బందిని పెంచాలి
- వైద్యం-ప్రజారోగ్యంపై రాష్ట్రస్థాయి సదస్సులో వక్తలు

వార్త మెయిన్‌లో

పైరుకు సెలైన్ ఎక్కించినట్టే నీరు

తీవ్రంగానే సాగునీటి ఎద్దడి - రబీలో ఆరుతడి పంటలే వేయండి - జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు

పేజీ 8

కొప్పునూరులో 4 వేల ఏళ్లనాటి చిత్రకళ



చిత్రకళను పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్, సిఇఒ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల

మండలంలోని కొప్పునూరు పొలిమేర గుండాలలో శిలాయుగపు చిత్రకళ వెలుగు చూసిందని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్, సిఇఒ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి ఆదివారం తెలిపారు. పురాతన అవశేషాలు, వారసత్వ కట్టడాలను గుర్తించి, స్థానికులకు అవగాహన కల్పించే 'ప్రిజర్వ్ హెరిటేజ్ ఫర్ పోస్టరిటీ 'కార్యక్రమంలో భాగంగా కొప్పునూరు శివారులోని గుండాల వద్ద గల వీరుల వాగు వద్ద కాకతీయుల కాలపు శిధిల వెంకటేశ్వర ఆలయాన్ని పరిశీలిస్తుండగా వాగులో కొత్త రాతియుగపు దుప్పి బొమ్మను కనుగొన్నట్లు చెప్పారు. మాచర్ల చరిత్రకారుడు పావులూరి సతీష్, రమేష్, కొప్పునూరుకు చెందిన స్థానిక యువకుడు, దుర్గంపూడి యుగనాథ్‌రెడ్డి, బుద్ధవనం ప్రాజెక్టు అధికారి, డి.ఆర్. శ్యాంసుందరరావు బృందంతో కలిసి వాగులో తిరిగి వస్తుండగా శిలాయుగపు రాతి ఆవాసపు

2లో

రేషన్ సరుకులన్నీ ఇవ్వాలి

- కందిపప్పు, పంచదార సరఫరా చేయడం లేదని కార్డుదారుల ఆవేదన
- పనుల్లేక ఇబ్బంది పడుతుంటే ధరలు, పన్నుల భారాలు ఏమిటని ప్రభుత్వంపై ఆగ్రహం
- మూడోరోజు కొనసాగిన సిపిఎం ప్రజారక్షణ భేరి పాదయాత్ర



పాదయాత్రలో మాట్లాడుతున్న సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్

ప్రజాశక్తి-సత్తెనపల్లి

రేషన్ ద్వారా బియ్యం మాత్రమే ఇస్తున్నారని కందిపప్పు, పంచదార అనేక నెలలుగా ఇవ్వడం లేదని సిపిఎం నాయకుల ఎదుట ప్రజలు వాపోయారు. బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార ఇతర నిత్యావసర వస్తువులను సరఫరా చేసేలా చూడాలని కోరారు. సిపిఎం చేపట్టిన ప్రజారక్షణ భేరి పాదయాత్ర మూడవ రోజైన ఆదివారం పట్టణంలోని జండా చెట్టు, ధోబి ఘాట్, ముస్లిమ్ పాలెం, క్రిస్టియన్ పేట ప్రాంతాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మాట్లాడుతూ బిజెపి పాలిత రాష్ట్రాల్లో జరుగుతున్న దారుణాలు మహిళలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, దాడులు చూస్తుంటే భవిష్యత్తులో మన పరిస్థితులు ఎలా ఉంటాయోనని భయంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాల పాలనలో అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలతో విసిగిపోయి గత ఎన్నికల్లో వైసిపికి ఓట్లు వేస్తే ముఖ్యమంత్రి

2లో



కొప్పునూరులో 4 వేల ఏళ్లనాటి చిత్రకళ

(మొదటి పేజీ తరువాయి)

గోడపై 20క్ష్మ15 సెంటీమీటర్ల పొడవు, ఎత్తులతో ఉన్న దుప్పి చిత్రం కనిపించిందన్నారు. కొత్త రాతియుగపు ప్రజలు వారు నిత్యం వాడే రాతి పనిముట్లతో రాతిచరియ కప్పుపై వరసగా కొట్టి, చక్కటి కొమ్ములున్న దుప్పి బొమ్మను తీర్చిదిద్దారని, కొంచెం దూరంలో కొత్త రాతియుగపు రాతి పనిముట్లు తయారు చేసుకొన్న ఫ్యాక్టరీ స్థలం ఉందని చెప్పారు. అదే వీరుల వాగులో ఉన్న మరో రాతి ఆవాసంపై తెల్ల జిగురు రంగుతో ముద్రించిన రెండు చేతి ముద్రలు ఉన్నాయని, సమీప పొలాల్లో ఉన్న ఇనుప యుగపు సమాధుల వల్ల ఈ చేతి ముద్రలు క్రీస్తు పూర్వం వెయ్యేళ్ల నాటివని శివనాగిరెడ్డి వివరించారు. వాగు బయట గల పొలాల్లో శాతవాహన కాలపు ఇటుకలు, మట్టి పాత్రల అవశేషాలను కూడా గుర్తించామని తద్వారా, కొప్పునూరుకు శిలాయుగం నుండి శాతవాహన కాలం వరకు చరిత్ర ఉందని తెలిపారు. ఈ పురావస్తు ఆధారాలను కాపాడుకొని భవిష్యత్ తరాలకు అందించాలని, కొప్పునూరు గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు.

జిజిహెచ్‌కు నిధుల కొరత

(మొదటి పేజీ తరువాయి)

స్కానింగ్, పరీక్షాయంత్రాలు, ఆపరేషన్ల థియేటర్లు, ఇతర సదుపాయాలకోసం రూ.20 కోట్లు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు. ఈ నిధులు ప్రభుత్వం ఎప్పటికి విడుదల చేస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పుడున్న ఆర్థిక పరిస్థితుల్లో ఇంత నిధులు ఒకేసారి ఇవ్వడం సాధ్యం కాకపోతే నూతనంగా నిర్మించిన ఎంసిహెచ్ భవనం వినియోగంలోకి తేలేమని వైద్యులు, అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆస్పత్రి మొత్తం మీద 1600 మంది ఇన్‌పెషెంట్లు ఉన్నారు. కానీ మూడేళ్లక్రితం వరకు ఉన్న లెక్కల ప్రకారం 1200 పడకలే మంజూరయ్యాయి. అధికారికంగా పడకల సంఖ్య పెరగకపోవడంతో మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు చాలా తక్కువగా వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. దాదాపు 400 మంది అదనంగా ఆస్పత్రిలో నిత్యం ఇన్‌పెషెంట్లుగా చికిత్సలు పొందుతున్నా ఇందుకు తగినంత నిధులు ఇవ్వకపోవడం వల్ల ఇప్పటికే ఆస్పత్రిలో అవసరమైన మేరకు మౌలిక సదుపాయాల కల్పనలో జాప్యం జరుగుతోంది. ఆస్పత్రికి ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు కూడా సకాలంలో రావడం లేదు. ఈ నేపథ్యంలో నూతనంగా నిర్మిస్తున్న మాతా శిశుసంరక్షణ కేంద్రభవన సముదాయంలో మౌలిక వసతులకు రూ.20 కోట్లు విడుదల అంశం ప్రశ్నార్థకంగా మారింది.

ప్రతిపాదనలు పంపాం

ఆస్పత్రిలో నూతనంగా నిర్మిస్తున్న మాతా శిశుసంరక్షణ కేంద్ర భవన సముదాయంలో మౌలిక వసతులు, ఇతర సదుపాయాలు కల్పించేందుకురూ.20 కోట్లు ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. మరో నాలుగు నెలల్లో ఐదు అంతస్తుల భవనం నిర్మాణం అప్పగిస్తారని ఈలోగా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే అంతర్గత మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారిస్తామని అన్నారు.

19న బికె పాలెంలో ఆరోగ్య సురక్ష శిబిరం

ప్రజాశక్తి-కాకుమాను

మండలంలోని బికె పాలెంలో గురువారం ఉదయం 10 గంటలకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం ఉంటుందని ఎంపిడిఒ పి.రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రకాల వైద్యనిపుణులు హాజరై వైద్యసేవలు అందిస్తారని, ప్రజలంతా హాజరై వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

(మొదటి పేజీ తరువాయి)

జగన్మోహన్‌రెడ్డి కూడా అవే విధానాలతో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మరికొందరు విమర్శించారు. ఒకవైపు పనులు లేక ఇబ్బందులు పడుతుంటే అదిక ధరలు, ఇంటి పన్ను, చెత్త పన్ను, విద్యుత్ ఛార్జీలు పెంచడంతో ఈ భారాలను మోయలేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ముస్లిమ్ మైనార్టీల పిల్లలు చదువుకునేందుకు గతంలో మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సహాయం చేసే వారని, ప్రస్తుత ప్రభుత్వం దాన్ని నిలిపేసిందని అసహనం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికార, ప్రతిపక్ష పార్టీలు గాలికొదిలేసాయని అన్నారు. కేంద్రంలోని బిజెపి చెప్పినట్లు రాష్ట్రంలోని జగన్మోహన్‌రెడ్డి చేస్తున్నారని, అందులో భాగంగానే విద్యుత్ ఛార్జీల భారం ప్రజలపై మోపారని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి డి.విమల, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు, నాయకులు కె.దుర్గారావు, ఎం.హరిపోతురాజు, రాజకుమార్ వి.రామారావు, ఎం.వెంకటనారాయణ, పి.రామారావు, ఆర్.పురుషోత్తం, కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రేషన్ సరుకులన్నీ ఇవ్వాలి



ముప్పాళ్ల మండలం మాదలలో జగనన్న కాలనీ స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మాదలలోని పాదయాత్ర చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, మండల కార్యదర్శి జి.బాలకృష్ణ మాట్లాడుతూ జగనన్న కాలనీల పేరుతో మాదలలో 120 మందికిపైగా స్థలాలను ముప్పాళ్ల వెళ్లే డొంక వెంబడి ఇచ్చారని, అయితే నిర్మాణాలేమీ ఇంకా చేపట్టలేదని అన్నారు. ఇప్పటికైనా లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్లు నిర్మించాలని, లబ్ధిదారులకు ఇచ్చే ప్రోత్సాహాన్ని పెంచాలని కోరారు. మాదల ఎస్సీ కాలనీలో ఎలిమెంటరీ పాఠశాల వద్ద తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేని కారణంగా పలువరు రోగాల బారిన పడుతున్నారని చెప్పారు. గ్రామం మొత్తం విషజ్వరాలతో అల్లాడుతున్నారని, సత్వరమే పారిశుధ్యాన్ని మెరుగుపర్చడంతోపాటు వైద్యసేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జి.జాలయ్య, పి.సైదాఖాన్, సిహెచ్.నాగమల్లేశ్వరరావు, ఐ.సత్య నారాయణరెడ్డి, వెంకటరెడ్డి, టి.బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అవయవ దానంపై అవగాహన పెంచుకోండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



అవయవ దానం గురించి ప్రజల్లో చైతన్యం రావాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. జిజిహెచ్ లో ఆదివారం సావిత్రి బాయి పూలే ఎడ్యుకేషనల్, చారిటబుల్ ట్రస్ట్ అఖిల భారత శరీర, అవయవ దాతల సంఘం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. సదస్సుకు సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎస్‌వి రమణ అధ్యక్షత వహించారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ జిజిహెచ్‌లో అవయవ మార్పిడి శస్త్ర చికిత్సలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, లివర్, కిడ్నీ, గుండె మార్పిడికి అనుమతులు ఇచ్చిందన్నారు. త్వరలో అవయవ మార్పిడి చేసేందుకు అన్నీ సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. పార్థివదేహాలకు అవయవ దానం చేసిన బ్రెయిన్‌డెడ్ దాతలకు, మెడికల్ కళాశాలలకు దానం చేసే దాతలకు రాష్ట్ర ప్రభుత్వం గౌరవ మర్యాదలతో ప్రోత్సహిస్తోందని చెప్పారు. చెన్నై ముఖ్యమంత్రి స్టాలిన్ తీసుకున్న నిర్ణయం ప్రజామోదం పొందిందని ఆయన అన్నారు. ఆవిధంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా అలాంటి నిర్ణయం తీసుకుంటే బాగుటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 17 మెడికల్ కళాశాలను అందుబాటులోకి తెస్తోందని, నాలుగు వేల వైద్య విద్యార్థులు అదనంగా వైద్య విద్యలో చేరడానికి ఒక మార్గం ఏర్పాటు చేసిందని చెప్పారు. సావిత్రి బాయి బాటలో నడుస్తున్న ట్రస్ట్ చైర్మన్‌గా వ్యవహారిస్తున్న సీతామహాలక్ష్మీకు అభినందనలు తెలిపారు. సావిత్రి బాయిని ఆదర్శంగా తీసుకుంటున్న సీతామహాలక్ష్మీ ఒక వైపు, ఆటానామీ దినోత్సవంలో డాక్టర్ సావిత్రి మరో వైపు వేదికపై ఉండటం అద్భుతంగా ఉందన్నారు. ఈ సందర్భంగా అవయవ దానం చేసేందుకు 20 మంది ముందుకు వచ్చిన దాతలకు ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అనటామి విభాగం హెచ్ఒడి డాక్టర్ సావిత్రి, స్పెక్ట్ చైర్ పర్సన్ జి.సీతామహాలక్ష్మీ పాల్గొన్నారు.

భవ్యశ్రీ కుటుంబాన్ని ఆదుకోండి

ఏసురత్నం సన్మానసభలో వడ్డెర సంఘం నాయకుల వినతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



చిత్తూరులో ఇటీవల ఇంటర్ విద్యార్థిని భవ్యశ్రీపై అత్యాచారం, హత్య జరిగిన ఉదంతంపై నిందితులకు కఠిన శిక్షపడే వరకు వడ్డెరసంఘం పోరాడాలని పలువురు వక్తలుపిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక ఎన్‌జివో కల్యాణ మండపంలో వడ్డీయ రాజుల ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీగా ఎన్నికయిన చంద్రగిరి ఏసురత్నంకు ఘన సన్మానం జరిగింది. సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా భవశ్రీ కుటుంబాన్ని ఆదుకోవాలని ఇందుకోసం తమ సామాజిక తరగతివారు ముందుకు రావాలని సభలో పలువురు నాయకులు పిలుపునిచ్చారు. వడ్డెర కులానికి తొలిసారిగా ఒక్క ఎమ్మెల్సీ పదవి వచ్చిందని, వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేల టిక్కెట్లు కోసం రాజకీయాలకు అతీతంగా కృషి చేయాలని వక్తలు కోరారు. వడ్డెరలను ఎస్‌టిల్లో చేర్చాలన్నారు. ఏసురత్నం మాట్లాడుతూ భవ్యశ్రీ హత్య ఉదంతం తెలిసిన వెంటనే చిత్తూరు జిల్లా అధికారులతో చర్చించానని తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వ పరంగా తగిన చర్యలు తీసుకునేందుకు సిఎంతో చర్చిస్తామని చెప్పారు. భవ్యశ్రీ కుటుంబానికి ఆయన రూ.లక్ష సాయం ప్రకటించారు. సభలో పాల్గొన్న నాయకులు కూడా పలువురు తమ వంతు సాయాన్ని అందచేస్తామని ముందుకు వచ్చారు. సభలో సర్వశిక్ష విభాగం జిల్లా అదనపు ప్రాజెక్టు డైరక్టర్ విజయలక్ష్మీ, కార్పొరేటర్ వేములజ్యోతి,రాయపాటి అరుణ, కుంచాల కోటేశ్వరమ్మ, వడ్డీయ రాజుల ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు తన్నీరు శ్రీనివాస్, బండారుసత్యనారాయణ, చంద్రశేఖర్, నాగభూషణం, జి.శ్రీనివాసరావు, బత్తుల నాగేశ్వరరావు, డి.వెంకటేశ్వర్లు, తన్నీరు రాంబాబు, ప్రొఫెసర్ తన్నీరు కృష్ణమూర్తి, తురగా కిషోర్, కె.వెంకటేశ్వర్లు, అంకమ్మరావు, లక్ష్మయ్య, వల్లెపు కృపారావు ప్రసంగించారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళ మృతి

ప్రజాశక్తి-తెనాలి



ఆస్పత్రికని వచ్చిన మహిళ ఆర్టీసీ బస్టాండ్‌లో గుండెపోటుతో మృతి చెందారు. పట్టణంలో ఆదివారం జరిగిన ఈ ఘటనపై వివరాల ప్రకారం.. భట్టిప్రోలు మండలం ఐలవరానికి చెందిన ప్రత్తిపాటి లక్ష్మి(52) అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో తోడి కోడలు ప్రసన్న దేవితో కలిసి తెనాలి వచ్చిన ఆమె పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో వైద్యం చేయించుకుని, తిరుగు ప్రయాణం నిమిత్తం మధ్యాహ్నం సమయంలో ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నారు. ఇంతలో ఒక్కసారిగా అస్వస్థతకు గురై కుప్పకూలిపోయారు. ప్రయాణికులు 104 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తీవ్రమైన గుండెపోటుతో మృతి చెందినట్లు భావిస్తున్నారు. తోటి కోడలు ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

'చదువు టాలెంట్ - నేటి విద్యార్థి' వర్క్ షాప్

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక పద్మశాలీయ కళ్యాణ మండపంలో తెనాలి రామకృష్ణ అకాడమీ ఆధ్వర్యంలో ప్రతినెలా రెండవ శనివారం జరిగే 'చదువు, టాలెంట్ - నేటి విద్యార్థి' వర్క్‌షాప్ నిర్వహించారు. గుంటూరు ఇంటిలిజెన్స్ డీఎస్పీ జి.లక్ష్మయ్య మాట్లాడుతూ చదువుతో పాటు ఏదో ఒక నైపుణ్యం నేర్చుకోవాలనే లక్ష్యంతో ఇలాంటి వర్క్‌షాప్‌ల నిర్వహణ అభినందనీయమన్నారు. స్కిట్, పద్యపఠనం అంశాలను అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు వివరించారు. పద్యాలు ఆలపించటంలో మెలకువలు గాయకుడు వెంపటి సత్యనారాయణ వివరించారు. వివిధ పాఠశాలల నుండి దాదాపు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వచ్చే నెల రెండవ శనివారం మిమిక్రీ, జనరల్ నాలెడ్జ్ అంశాలపై శిక్షణ ఉంటుందని అయినాల మల్లేశ్వరరావు తెలిపారు.

అవినీతిలో కూరుకుపోయిన ప్రభుత్వం

ప్రజాశక్తి-తెనాలి

అవినీతిలో కూరుకుపోయిన ప్రభుత్వాన్ని పారదోలేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. మండలంలోని చావావారి పాలెంలో ఆదివారం రాత్రి ఆయన పర్యటించి జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికి తిరిగారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ఒక్కసారి అవకాశం అంటూ అధికారంలోకి వచ్చిన వైసిపి అవినీతిలో కూరుకుపోయిందన్నారు. రూ.37 వేల కోట్లు మద్యం కుంభకోణానికి పాల్పడిందని ఆరోపించారు. మెగా డీఎస్సీ నిర్వహిస్తానని చెప్పి నిరుద్యోగులకు మొండి చేయి చూపారన్నారు. ఈ సందర్భంగా పలువురు జనసేనలో చేరారు. కార్యక్రమంలో నాయకులు దివ్వెల మధుబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు ఘన నివాళి

సత్తెనపల్లి టౌన్: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎ.బి.జె అబ్దుల్ కలాం జయంతిని స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి అంబటి రాం బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ ముస్లింల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఈ సందర్భముగా కాంగ్రెస్ పార్టీ నుండి వచ్చిన 30 కుటుంబాలకు ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి, సిహెచ్ సాంబశివరావు, శివప్రసాద్, మీరాన్, కోటేశ్వరరావు నాయక్ పాల్గొన్నారు. **పల్నాడు జిల్లా:** నరసరావుపేటలోని కలాం విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పూల మాల వేసి నివాళు లర్పించారు. **నకరికల్లు:** గుండ్లపల్లిలోని ఉర్దూ స్కూల్‌లో హెల్పింగ్ హాండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పల్నాడు జిల్లా డిస్టిక్ రెవెన్యూ ఆఫీసర్ వినాయక, జూనియర్ సివిల్ జడ్జి కేవీఎస్ హరీష్‌బాబు పాల్గొన్నారు. ముందుగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. **ఈపూరు:** మండల శాఖ గ్రంధాలయంలో అబ్దుల్ కలాం చిత్ర పటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వాహకులు గంటా శ్రీనివాసరావు మాట్లాడారు. అనంతరం విద్యా ర్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. **క్రోసూరు:** జడ్పీ హెచ్



తాడేపల్లిలోని టిడిపి కార్యాలయంలో..

స్కూల్లో మాజీ యార్డ్ చైర్మన్ , విగ్రహ దాత కాంద్రు కాశయ్య అధ్వర్యంలో కలాం విగ్రహానికి నివాళు లర్పించారు. క్రోసూరులోని ప్రభుత్వ బి.సి. కళాశాల బాలురవసతి గృహంలో శ్యామ్ మిత్ర మండలి ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పించారు మండల గౌరవ అధ్యక్షులు శాంసన్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. వసతి గృహ సంక్షేమ అధికారి బి. రత్తయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలాం జీవిత చరిత్రపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. **ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి:** మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం 92వ జయంతి వేడు కలు ఆదివారం ఎమ్మెల్యే మద్దాలి గిరి కార్యాలయంలో ఘనంగా జరిగాయి. మేయర్ కావటి మనోహర్ నాయుడు, మద్దాలి గిరి అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ అబ్దుల్ కలాం ప్రపంచ ప్రసిద్ధి చెందిన అంతరిక్ష శాస్త్రవేత్తగా గుర్తింపు పొందారని అన్నారు.పేదరికంలో జన్మించినా కష్టపడితే ఉన్నత శిఖరాలను అధి రోహించవచ్చునని నిరూపించిన వ్యక్తి అన్నారు. ఆయన సేవలను స్ఫూర్తిగా తీసుకుని యువత అన్ని రంగాల్లో ముందుండాలని కోరారు. **దుగ్గిరాల:** స్థానిక అలీ నగర్ ఉర్దూ పాఠశాలలో నిర్వహించిన అబ్దుల్ కలాం జయంతి ఉత్సవాలలో



గుంటూరులోని ఎమ్మెల్యే మద్దాలి గిరి కార్యాలయంలో ..

ఎంపీడీవో కుసుమ శ్రీదేవి పాల్గొన్నారు. కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. **చేబ్రోలు:** నారాకోడూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎపిజె అబ్దుల్ కలాం జయంతి, అంతర్జాతీయ చేతులపరిశు భ్రత దినోత్సవ వేడుకలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎ వి హెచ్ ప్రసాద్, ఆర్ సుబ్బారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, డిబేట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. **కాకుమాను:** స్థానిక అంబేద్కర్ భవనంలో నిర్వహించిన అబ్దుల్ కలాం జయంతి వేడుకల్లో వైస్ ఎంపిపి కపిల్ దేవ్ పాల్గొన్నారు. **పెదకాకాని రూరల్ :** పెదకాకానిలో అబ్దుల్ కలాం నూతన విగ్రహాన్ని గ్రామానికి చెందిన ముస్లింపాలెం




పెదకాకానిలో అబ్దుల్ కలాం నూతన విగ్రహావిష్కరణ..



సత్తెనపల్లిలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

చిన్నారులు ఆవిష్కరించారు. భారతదేశానికి అత్యుత్తమ సేవలు అందించిన మహనీయుడు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అందరికీ ఆదర్శనీయుడని వారు కొనియాడారు. ముస్లిం పాలెంకు చెందిన ప్రజలు నిధులు సమీకరించి విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని పలువురు కొనియాడారు. **తాడేపల్లి:** డాక్టర్ అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమం తాడేపల్లి టిడిపి కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి డి.దాసు, ఎ.మురళీ, ఎం.గోపాలరావు, డి.రామా రావు, ఎస్కె చాంద్‌బాష, సైదా, సలాం, ఇంతియాజ్ పాల్గొన్నారు. తాడేపల్లి పట్టణంలోని మారుతి వెంచర్‌లో అబ్దుల్ కలాం విగ్రహానికి మారుతి ఫౌండేషన్ అధినేత



తాడేపల్లి పట్టణంలోని మారుతి వెంచర్‌లో ..

జంగాల సాంబశివరావు, మైనార్టీ అధ్యక్షులు ఎస్కె చాంద్ బాషాలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ వ్యక్తుల్లో అబ్దుల్ కలాం ఒకరని కొనియాడారు. **పొన్నూరు రూరల్:** పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలు జడ్పీ పాఠశాలలో పొన్నూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు తోట రాంబాబు , పొన్నూరు జర్నలిస్టులు పాల్గొన్నారు.

విద్వేషాలను ఆపి ప్రగతిని సాధించండి

జనచైతన్య వేదిక అధ్యక్షులు లక్ష్మణరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో విద్వేషాలను, వేధించడం,ప్రతిపక్ష నేతలపై దాడులు చేయటం లాంటి దుశ్చర్యలను ఆపి అభివద్ధి కోసం కషిచేయాలని జనచైతన్య వేదిక అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఉదయం తన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో లక్ష్మణరెడ్డి తో పాటు ప్రముఖ వైద్యులు డా.యర్రా నాగేశ్వరరావు,ఎఐటియుసి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వి. రాధాకృష్ణమూర్తి, ప్రోగ్రసివ్ ఫోరం ఉపా ధ్యక్షులు మురళీకృష్ణారావు తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలో నీటిపారుదల ప్రాజెక్టులు నత్తనడకన నడుస్తున్నాయని పోలవరం, వెలుగొండ, హంద్రీనీవా, వంశధార లాంటి ప్రాజెక్టులను పూర్తి చేయలేకపోతున్నా రన్నారు. పంచాయతి సర్పంచులు నిధులు, విధులు లేక ఉత్సవ విగ్రహాలుగా మారినారన్నారు. సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థలు సమాంతర వ్యవస్థలుగా మారి గ్రామ సర్పంచ్ కు విలువలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో ఉత్పాదక వ్యయం కన్నా అనుత్పాదక వ్యయం పెరుగుతూ 10లక్షల కోట్ల అప్పుతో అప్పుల ఊబిలోకి నెట్టివేయబడిందని ప్రతినెల 7వేల కోట్లకుపైగా వడ్డీ రూపంలో రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు.



చంద్రకళ పీజీ కాలేజీలో దసరా వేడుకలు

ప్రజాశక్తి-తెనాలి

దసరా సందర్భంగా స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని చంద్రకళ పీజీ కాలేజీలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో కళాశాల యాజమాన్యం ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించింది. కళాశాల అధ్యక్ష, కార్య దర్శులు నంబూర వెంకటకృష్ణమూర్తి, నూకల వెంకట వేణుగోపాలరావు అందరికీ శుభాకాంక్షలు తెలిపి నూతన వస్త్రాలను బహూకరించారు. కోశాధికారి ఆర్.సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి జి.రామ్మోహన రావు, కె.మోహనరావు, ఇసి సభ్యులు బద్రీనాథ్‌గుప్తా, శశి గ్రూప్ చైర్మన్ యు.వరదరాజులు పాల్గొన్నారు.

సంకెళ్లతో టిడిపి నిరసనలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తెలుగు యువత ఆధ్వర్యంలో స్థానిక లాడ్జి సెంటర్‌లో 'న్యాయానికి సంకెళ్లు' పేరిట చేతులకు సంకెళ్ల ధరించి టిడిపి నాయకులు నిరసన తెలిపారు. మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు ప్రజాస్వామ్యాన్ని రక్షించాలంటూ వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులను ఖండిస్తూ వెంటనే మల్టీ స్పెషలిటీ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందజేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో గుంటూరు అర్బన్ టిడిపి అధ్యక్షులు డేగల ప్రభాకర్ ,టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు చిట్టాబత్తిన చిట్టిబాబు, బుచ్చిరాంప్రసాద్,మద్దిరాల మ్యాని ,రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాస్,కార్పొరేటర్ వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్ ,రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షులు షేక్ ఫిరోజ్,జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు కురంగి అనిల్ ,జిల్లా అధికార ప్రతినిధి షేక్ షుకూర్,తప్పెట్ల ప్రదీప్ చంద్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం ఎదుట న్యాయానికి సంకెళ్ల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా టిడిపి కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య మాట్లాడారు. **తాడేపల్లి:** చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో చేతులకు నల్లరిబ్బన్లు కట్టుకుని న్యాయానికి సంకెళ్లు అంటూ నిరసన తెలిపారు. చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని కోరారు. **తాడేపల్లి రూరల్:** ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నియంతృత్వ పాలన పోవాలని టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు అన్నారు. ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి టిడిపి తాడేపల్లి మండల కార్యాలయంలో టిడిపి శ్రేణులు న్యాయా నికి సంకెళ్ల పేరుతో, చేతులకు నల్ల రిబ్బన్లు కట్టుకొని, నిరసన వ్యక్తం చేశారు. సుబ్బారావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధి నేత నారా చంద్రబాబు నాయుడు ని అన్యాయంగా జైలుకు పంపిన కారణంగా, టిడిపి పిలుపులో భాగంగా న్యాయానికి సంకెళ్ల పేరుతో, నిరసన కార్యక్రమం చేపట్టినట్టు ఆయన తెలిపారు. కార్య క్రమంలో తెలుగుదేశం సీనియర్ నాయకులు కోలంటి మహేష్, కాజా భరత్ కుమార్, తెలుగు యువత నాయకులు కోలంటి అశోక్, తప్పెట్ల రాజు, తెలుగు మహిళా నాయకురాలు దాశెట్టి అరుణ తదితరులు పాల్గొన్నారు. **దుగ్గిరాల:** మండల కేంద్రం దుగ్గిరాలలో టిడిపి నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. **సత్తెనపల్లి:** టిడిపి జనసేన నేతల ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు నగరంపాలెంలో కన్నా గారి క్యాంపు కార్యాలయం వద్ద చంద్రబాబు పై బనాయించిన అక్రమ కేసులు అక్రమ అరెస్టును ఖండిస్తూ చేతులకు నలుపు తాడులతో సంకెళ్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కన్నా లక్ష్మీ నారాయణ మాట్లాడారు. **నాదెండ్ల:** మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గుర్రం నాగ పూర్ణ చంద్రరావు అధ్వర్యంలో నిరసన తెలిపారు. **పెదకూరపాడు:** జగన్ నియంతత్వ పోకడలు దేశమంతా చూస్తున్నారని పెదకూరపాడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ విమర్శించారు. చేతులకు సంకెళ్ళు వేసుకుని నిరసన తెలిపారు. మండల టిడిపి అధ్యక్షులు రమేష్, పెదకూరపాడు ఉపసర్పంచ్ జాగర్లమూడి రఘు, గ్రామ పార్టీ అధ్యక్షుడు వెల్లలచెరువు సురేష్ లు పాల్గొన్నారు.



తాడేపల్లిలో నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు



లింగంగుంట్లలోని ప్రాథమిక పాఠశాలలో వరల్డ్ హ్యాండ్ వాష్‌డే

భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

భోజనానికి ముందు ప్రతి ఒక్కరూ చేతులు శుభ్రం చేసుకోవాలని డిఎల్ పిఓ డాక్టర్ పుట్టా రమణయ్య అన్నారు. అక్టోబర్ 15 వరల్డ్ హాండ్ వాష్ డే సందర్భంగా పంచాయతి రాజ్ ,రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్, కలెక్టర్ శివశంకర్ లోతేటి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి ఎం వి భాస్కర్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం లింగంగుంట్ల గ్రామ పంచాయతీలోని ప్రాథమిక పాఠశాలలో వరల్డ్ హ్యాండ్ వాష్ డే ను నిర్వహించారు. పాఠశాల సిబ్బందికి, బడి పిల్లలకు చేతులు శుభ్రం చేసుకోవడం వలన కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. చేతులు శుభ్రం చేసుకోవడంలో 5 రకాల ఎక్సర్సైజులు ఉంటాయని చెప్పి, వాటిని చేసి చూపించారు. 'ఆరోగ్యమే మహాభాగ్యం'లో భాగంగా మరుగుదొడ్డికి పోయిన తర్వాత, భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లింగం గుంట్ల పంచాయతి కార్యదర్శి కె.వి శివప్రసాద్,ప్రాథమిక పాఠశాల హెడ్ మాస్టర్ మూర్తి, అంగన్వాడీ టీచర్ పద్మ, సచివాలయ సిబ్బంది, మహిళా పోలీస్ శ్రీలక్ష్మి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ బాషా పాల్గొన్నారు.



యడ్లపాడులోని లూథరన్ హైస్కూల్లోని పూర్వ విద్యార్థుల కలయిక

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - యడ్లపాడు

పదిహేనేళ్ల వయసులో విడిపోయి 60 ఏళ్ల వయసులో కలుసుకున్న 50 మంది విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం చిన్ననాటి జ్ఞాపకాలు, ప్రస్తావనలతో అత్యద్భుతంగా జరిగింది. యడ్లపాడులోని లూథరన్ హైస్కూల్లోని 1978 వ సంవత్సరం బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలోకం హరిబాబు, యడ్లపాటి వెంకట రమణ మూర్తి, పుసులురి రంగాచారి, బాపట్ల వెంకట నారాయణ, మైదవోలు హనుమంతరావు, కేశన ముత్యాల రెడ్డి, భాగ్యప్రకాశమణి, పోపురి పుణ్యకుమారి నిర్వహించారు. ఇన్నేళ్ల తర్వాత ఇలా కలుసుకోవాలని చేసిన పూర్వ విద్యార్థుల కృషిని పలువురు వక్తలు కొనియాడారు. పూర్వ విద్యార్థిని వేగేశ్న అనురాధ అధ్యక్షత వహించారు. వివిధ హోదాల్లో ఉన్న పలువురు విద్యార్థులు తమ హోదాలు మరిచి, ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించు కుని, చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది జోసెఫ్ మాస్టారు, రైటర్ సోమరాజు హనుమంతరావులను సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు నిమ్మరాజు చలపతిరావు, ఎడ్ల సునీల్, వైవి రమేష్‌బాబులను పాఠశాల విద్యార్థులు సన్మానం చేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయిని పద్మలత, యడ్ల పాడు ఎంఇఒలకు సన్మానం చేశారు. పాఠశాల విద్యా కమిటీ అధ్యక్షుడు ఆలోకం పెద అబ్బయ్య, కమిటీ సభ్యులు చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, నూతలపాటి కాళిదాసు, ముత్తవరపు రామా రావు, పోపూరి వెంకట రత్తయ్యలకు పూర్వ విద్యార్థులు సన్మా నం చేశారు.

బతుకు బండి నడవట్లేదు

- దయనీయ స్థితిలో రిక్షా కార్మికులు
- కరువైన కిరాయిలు
- బండి అద్దె చెల్లింపునకూ అగచాట్లు

ప్రజాశక్తి - చిలకలూరిపేట





రవాణా రంగంలో వచ్చిన మార్పులతో రిక్షా కార్మికుల జీవనం కష్టంగా మారింది.రిక్షాలు,చెక్క బల్లలపై ప్రయాణించే వారి సంఖ్య బాగా తగ్గిపోయింది. ప్రస్తుతం రోజంతా రిక్షా లాగినా వాటి అద్దె కట్టేందుకు సరిపడా డబ్బులు కూడా రావడం లేదు. చిలకలూరిపేట పట్టణంలో ని సుమారు 10 సెంటర్లలో రిక్షా స్టాండ్‌లు ఉండేవి. ప్రతి స్టాండ్‌లో 4 వందల దాకా చెక్క బల్ల రిక్షాలు,150 నుంచి 200 వందల గూడు రిక్షాలు, రిక్షాలు ఉండేవి. పొగాకు కార్మికులను, వ్యవసాయ కూలీలను, ఇతర పనులకు వెళ్లే వారిని ఉదయం 7 గంటలకు పని ప్రదేశాలకు తీసుకువెళ్లి, మళ్లీ సాయంత్రం ఇళ్లకు చేర్చేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.. రిక్షాలో ప్రయాణం చేసే వారి సంఖ్య బాగా తగ్గిపోయింది. రిక్షా స్టాండ్లు అయితే ఉన్నాయి కానీ, రిక్షాల సంఖ్య అంతకంతకూ తగ్గిపోయింది. సొంత రిక్షా నడిపే వారి పరిస్థితే అంతంత మాత్రంగా ఉంటే, అద్దె రిక్షా తొక్కే కార్మికుల పరిస్థితి మరింత దయనీయం. రిక్షాలకు సంబంధించిన స్పేర్‌పార్ట్స్ విక్రయించే దుకాణాలు, పంచర్లు వేసే దుకాణాల వారి పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉంది. గతంలో సుమారు రిక్షాలకు సంబంధించిన విడి భాగాలు విక్రయించే దుకాణాలు 60 నుంచి 80 షాపులు, హోల్ సేల్ దుకాణాలు ఐదు ఉండేవి. ముఖ్యంగా ఒకొక్క షాపులో ఇద్దరు, ముగ్గురు పనిచేసే వాళ్లు ఉండేవారు. రిక్షాలు ఎక్కే వారి సంఖ్య తగ్గడంతో దాని ప్రభావం ఆయా షాపులపై పడటంతో వాటిని మూసి వేశారు. దీంతో, అందులో పనిచేసే వాళ్లందరూ వీధుల పాలయ్యారు. ప్రస్తుతం 2 రిటైల్ షాపులు, సుమారు 35 పంచర్ల షాపులు మాత్రమే వున్నాయి.

అద్దె కూడా కట్టలేని పరిస్థితి



పట్టణ రిక్షా వర్కర్ల్స్ యూనియన్ అధ్యక్షులు గంపా నాగేశ్వర రావు మాట్లాడుతూ తాను ముప్పై ఐదేళ్లుగా ఇదే వృత్తిలో కొనసాగు తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం బాడుగలు లేకపోవడంతో జీవనం సాగించడం కష్టంగా మారింది. దీనికితోడు పెరిగిన నిత్యా వసరాల ధరల భారం భరించలేకపోతున్నామన్నారు. గతంలో గూడు రిక్షాలు, రిక్షాలు కలుపుకుని మొత్తం సుమారు 15 వందల నుంచి 2 వేల వరకు ఉండేవి. పట్టణంలోని కొన్ని సెంటర్లలో రిక్షాల జాడే లేకుండా పోయింది. గతంలో బాడుగల ద్వారా రోజు కు నాలుగు వందల నుండి ఆరు వందల రూపాయల వచ్చేవి. రిక్షాలను అద్దెకు తీసుకుని నడిపించేవారు రోజుకు రూ.150 అద్దె కట్టలేని పరిస్థితుల్లో ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం రిక్షా కార్మికులను ఆదుకోవాలని కోరారు. గతంలో టిడిపి ప్రభుత్వం హయాంలో మే డే రోజున రెండు జతల బట్టలు ఇచ్చేదని అన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి

సిఐటియు మండల కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టణంలో సుమారుగా పది హేను వందల నుంచి రెండు వేల మంది వున్నారని, వీరికి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని అన్నారు. నలభై ఏళ్ళు దాటిని రిక్షా కార్మికులకు రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాల ని,వీరి పిల్లలకు ఉచిత చదువు చదివించాలని, ఇల్లు లేని వారికి ఉచితంగా కట్టించి ఇవ్వాలని, వడ్డీ లేని బ్యాంకు రుణాలు ఇవ్వాలని, మే డే రోజున నాలుగు జతల బట్టలు, కార్మికులకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వడ్డీ లేని రుణం ఇప్పించండి



రిక్షా కార్మిక సంఘం ఉపాధ్యక్షులు బి. కోటా నాయక్ మాట్లా డుతూ రిక్షా కార్మికులు కొంత మంది ఈ పనికి ప్రత్యామ్నాయంగా పంచర్లు, రిపేర్లు వేస్తూ జీవనం సాగిస్తున్నారు. గతంలో రోజుకు రూ.1700 నుంచి రూ. 2,000 వరకు ఆదాయం వచ్చేదని, ఇందులో పనివాళ్లకు ఇచ్చే డబ్బులు, ఇతర ఖర్చులు పోగా సుమారు రూ. 900 నుంచి రూ.1200 వరకు మిగిలేవని చెప్పారు. ప్రస్తుతం తమ ఆదాయం రూ.200కు పడిపోయిందని అన్నారు. ప్రభుత్వం వారు పట్టణంలోని 40 షాపుల వారికి వడ్డీ లేని రుణం కింద ఒక లక్ష రూపాయలు ఇప్పించాలని కోరారు.

19న మైనార్టీ రాష్ట్ర సదస్సు జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఈ నెల 19 న కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో జరగనున్న రాష్ట్ర స్థాయి మైనార్టీ సదస్సు జయప్రదం చేయాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ పిలుపు నిచ్చారు. ఈ మేరకు పల్నాడు విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆదివారం ప్రకటన చేశారు. రాష్ట్రంలో మైనార్టీల పట్ల సిపిఎం వైఖరి, మైనార్టీల సమ స్యలపై సిపిఎం అధ్యయనం చేసిన అంశాలపై క్షేత్ర స్థాయి లో రాష్ట్ర స్థాయి సదస్సులో చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సుకు పల్నాడు జిల్లా మైనార్టీ నాయకులు సయ్యద్ మహబూబ్ హుస్సేన్, మైనార్టీ రాష్ట్ర నాయకులు మహమ్మద్ చిష్టీ, మాజీ ఎమ్మెల్యే సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ గఫూర్, మాజీ పార్లమెంట్ సభ్యులు సిపిఎం సీనియర్ నాయకులు పి మధు, కర్నూలు జిల్లా మైనార్టీ నాయకులు ఎస్‌ఏ సుభాని, సిపిఎం రాష్ట్ర నాయకులు షేక్ ముజఫర్ అహ్మద్, సిపిఎం నరస రావుపేట పట్టణ నాయకులు షేక్ మసూద్ లు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. మైనార్టీలలో ఉన్న ఆర్థిక, సామాజిక, రాజకీయ అసమానతలను దూరం చేయడం వంటి అనేక అంశాలపై ఈ సదస్సులో చర్చించి, ఆయా సమస్యల పరిష్కారానికి తీర్మానం చేయనున్నట్టు తెలిపారు. మైనార్టీల అభివృద్ధి, సంక్షేమం, రక్షణ, లౌకికవాద పునరుద్ధరణ కోసం సిపిఎం కృషి చేస్తోందని పేర్కొన్నారు. జస్టిస్ అచార్ రంగనాథ్ మిశ్రా కమిటీల సిఫార్సులు అమలు చేయాలని, ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో ముస్లిం మైనార్టీలకు 10 శాతం రిజర్వేషన్ల చట్టబద్ధత కల్పించాలని, దుల్హన్ పథకం ద్వారా ప్రతి ముస్లిం మహిళకు విద్యతో సంబంధం లేకుండా కనీసం రూ.1 లక్ష సాయం అందించాలని, మైనార్టీ చిరు వ్యాపారస్తుల కోసం వడ్డీ రహిత బ్యాంకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయా లని తదితర హక్కుల సాధన కోసం సిపిఎం పోరాటం చేస్తోందని తెలిపారు. పేద ముస్లిం ప్రజలకు ఇంటి నిర్మా ణం, ఇళ్ల స్థలాలు కమ్యూనిటీ హాల్, రాజధాని ప్రాంతంలో ఉర్దూ అకాడమీ, హజ్ హౌస్ లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అన్యాక్రాంతమైన వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వ స్వాధీనం చేసుకొని ఆస్తుల పరిరక్షణకు చట్టాన్ని అమలు చేయాలన్నారు. ప్రతి మండలంలో ఒక ఉర్దూ మోడల్ స్కూల్, ప్రతి నియోజకవర్గానికి ఒక ఉర్దూ కళాశాల, ప్రతి జిల్లాకు ఉర్దూ యూనివర్సిటీ ఏర్పాటు చేసి ఉర్దూ భాషాభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి, సహకారం అందించాలని, విదేశీ విద్యా పథకం పునరుద్ధరించి జనాభా ప్రాతిపదికన చట్టసభలో ప్రాతినిధ్యం కల్పించాలని, జనాభా ప్రాతిపదికన రాష్ట్ర బడ్జెట్లో మైనార్టీలకు నిధులు కేటాయించాలని తదితర డిమాండ్లతో ఈ సదస్సు జరగనున్నట్లు పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీలు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సు ను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.

రాయితీపై శనగలు పంపిణీ

ప్రజాశక్తి-ఈపూరు

వర్ష భావ పరిస్థితుల దృష్ట్యా రైతులకు ప్రభుత్వం రాయితీపై శనగలు పంపిణీ చేసేందుకు ఆర్బికేలలో 600 క్వింటాళ్లను అందుబాటులో ఉంచినట్లు ఏవో ఆర్ రామారావు తెలిపారు. మండలంలోని కొండాయపాలెం ఆర్బికేలో 150 క్వింటాళ్లు, కొచ్చర్ల, అంగలూరు, చిట్టాపురం ఆర్బికే ల లో 100 క్వింటాళు ,,ఎ ముప్పాళ్ల, ఇనిమెళ్ళ, వనికుంట ఆర్బికేలలో 50 క్వింటాళ్ల నిల్వలు ఉన్నట్లు చెప్పారు. కిలో శనగలు రూ. 81 కాగా, రాయితీ పోను రైతులకు రూ. 48.60 చెల్లిం చాలని చెప్పారు. ఒక ఎకరాకు 40 కిలోల శన గలు అవసరమని అన్నారు. ఒక్కొక్క రైతుకు ఐదు ఎకరాలకు (200 కిలోలు) శనగలు అంద జేస్తా మన్నారు. అలాగే రైతు భరోసా, పిఎం కిసాన్ దరఖాస్తుకు ఈ నెల 15వ వ తేదీ వరకు అవకాశం ఉంద న్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అమరావతి - బెల్లకొండ రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి-క్రోసూరు



రూ.149 కోట్లతో చేపట్టిన అమరావతి - బెల్లంకొండ డబుల్ లేన్ రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అధికారులను ఆదేశించారు. మండలంలోని ఊటుకూరులో జరుగు తున్న రోడ్డు పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఊటుకూరు గ్రామాల్లో రోడ్డు నిర్మాణంలో భాగంగా సిమెంట్ రోడ్లు, డైన్లు వేయిస్తున్నట్లు చెప్పారు. నాణ్యత విషయంలో రాజీ పడొద్దని,ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకు రావాలని చెప్పారు.

కూలీలు, రైతుల కోసం పోరాడిన నారాయణ

ప్రథమ వర్ధంతి సభలో వక్తలు

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

ఆదర్శ కమ్యూనిస్టు అయిన తేళ్ల నారాయణ ఆశయాల సాధనకు కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు అన్నారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో తేళ్ల నారాయణ ప్రథమ వర్ధంతి సభను సిపిఎం మండల కార్యదర్శి డి.రమేష్‌బాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. అప్పారావు మాట్లాడుతూ కుల వివక్ష, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా నారాయణ పోరాడారని, శాస్త్రీయ భావాలను అభివృద్ధి కృషి చేశారని చెప్పారు. వ్యవసాయ కార్మికులకు కూలి పెంపుతోపాటు రైతు సమస్యల పరిష్కారానికీ పాటుపడ్డారన్నారు. జీవితాంతం కమ్యూనిస్టు సిద్ధాంతానికి, విలువలకు కట్టుబడి పని చేశారని చెప్పారు. ప్రస్తుత రాజకీయాలపై మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి



సభలో మాట్లాడుతున్న ఈమని అప్పారావు

ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసిందని, పారిశ్రామిక రంగాన్ని అభివద్ధి చేయకపోగా జాతీయ సంపద అయిన ఎల్ఐసి, జిఐసి, రైల్వే, విమానయానం, పోర్టులు, గనులను, అటవీ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని మండిపడ్డారు. రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కుతున్నారని, భిన్నాభిప్రాయం వ్యక్తం చేసిన వారిని దేశద్రోహులుగా ముద్ర వేస్తున్నారని తెలిపారు. రాజ్యాంగం స్థానంలో మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేసే కుట్ర జరుగుతోందన్నారు. మోడీ పాలనలో దేశం అన్ని రంగాల్లోనూ వెనబడిందని, ప్రపంచ ఆకలి సూచిలో దేశం 111వ స్థానానికి దిగజారిందని తెలిపారు. రాష్ట్రానికి విభజన చట్టంలోని హామీలను విస్మరించి అన్యాయం చేశారని, విశాఖ ఉక్కునూ అమ్మేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. అయినా బిజెపిని రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన ప్రశ్నించడం లేదని, పైగా ఆ పార్టీతో అంటకాగుతున్నారని దుయ్యబట్టారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడ్డం ద్వారా తేళ్ల నారాయణకు నివాళు లర్పించాలన్నారు. సభలో వివిధ సంఘాల నాయకులు కె.నాగేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, కె.హరిబాబు, కె.శివనాగేశ్వరరావు, టి.వినోద మాట్లాడారు. ఎం.వెంకటేశ్వర్లు, డి.శ్రీనివాసరావు, ఎం.రమణ, సిహెచ్.యానాదులు, కె.శ్రీనివాసరావు, బి.శంకరయ్య, కె.చంద్రరావు, భువవనేశ్వరి, ఎం.లక్ష్మి, విజయలక్ష్మి, కె.వెంకట సుబ్బారావు, పిఎఎస్ కళాశాల ప్రిన్సిపాల్ జి.వీరరాఘవయ్య పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణ పరిధిలోని రోడ్డు విస్తరణలో భాగంగా కూల్చిన భవనాల యజమానులకు నష్ట పరిహారం త్వరితగతిన ఇచ్చి విస్తరణ పనులు వేగవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి కోరారు. ఈ మేరకు యజమానులను మస్తాన్‌వలితోపాటు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జక్కా శ్రీనివాస్, ఇతర నాయకులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మస్తాన్‌వలి మాట్లాడుతూ విస్తరణ పనులకు తాము వ్యతిరేకం కాదని, అయితే అధికారుల వైఖరితో భవన యజమానులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. భవనాలు కూల్చి రెండు నెల్లయినా విస్తరణ పనులు ముందుకు సాగడం లేదన్నారు. ఇప్పటికైనా పనుల వేగం పెంచాలని, బాధితులకు న్యాయం చేయాలని జక్కా శ్రీనివాస్ కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు టి.సాంబయ్య, సిహెచ్.రవి, చేబ్రోలు మండల అధ్యక్షులు ఎం.కోటయ్య, నాయకులు గౌస్, కాలేషా, ఫణి, రేవంత్ పాల్గొన్నారు.

నేడు తెనాలి కౌన్సిల్ సమావేశం - ఇన్‌ఛార్జి చైర్మన్ ఎన్నిక

ప్రజాశక్తి-తెనాలి

మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం ఉదయం కౌన్సిల్ హాల్లో జరుగనుంది. ఇప్పటివరకూ చైర్‌పర్సన్‌గా వ్యవహరించిన సయ్యద్ ఖలేదా నశీం ఇటీవల రాజీనామా చేసిన నేపథ్యంలో కౌన్సిల్ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.



మాలేపాటి హరిప్రసాద్

కౌన్సిల్‌లో మొత్తం 40 మంది సభ్యులుండగా, వారిలో 32 మంది అధికార వైసిపికి చెందినవారు, మిగిలిన 8 మంది ప్రతిపక్ష టిడిపికి చెందిన వారు. తొలుత చైర్‌పర్సన్‌గా ముస్లిములకు అవకాశం కల్పిస్తామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పిన విధంగా సయ్యద్ ఖలేదానశీంకు అవకాశం కల్పించారు. రెండున్నరేళ్ల పదవిని పూర్తి చేసుకున్న ఆమె రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ముందుగా నిర్ణయించిన ప్రకారం రెండో విడతలో బిసి సామాజిక తరగతికి చెందిన 8వ వార్డు కౌన్సిలర్ తాడిబోయిన రాధికకు చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించాలన్నది ఎమ్మెల్యే భావన. అయితే నిబంధనల మేరకు చైర్‌పర్సన్ రాజీనామాను కౌన్సిల్ ఆమోదించి డిఎంఎకు పంపాల్సి ఉంది. దానిని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆమోదించి, ఎన్నికల కమిషన్‌కు పంపితే వారు కూడా ఆమోదించి తిరిగి ఎన్నిక ప్రక్రియకు షెడ్యూల్ విడుదల చేయాల్సి ఉంటుంది. సోమవారం జరిగే కౌన్సిల్ సమావేశంలో సభ్యులు నిర్ణయం తీసుకోనున్నారు. చైర్మన్ ఎన్నిక అధికారికంగా జరిగే వరకూ నిబంధనల మేరకు కౌన్సిల్‌లో సీనియర్ సభ్యులకు ఇన్‌ఛార్జి చైర్మన్‌గా అవకాశం కల్పించాల్సి ఉంది. వైస్ చైర్మన్‌గా రెండున్నరేళ్ల అనుభవం కలిగిన మాలేపాటి హరిప్రసాద్‌కు ఇన్‌ఛార్జి చైర్మన్‌గా కొనసాగించేందుకు ఎమ్మెల్యే ఆమోదించినట్ల వైసిపి నాయకులు చెబుతున్నారు. కౌన్సిల్‌లో కూడా అధికార పార్టీకి పూర్తి మెజారిటీ ఉన్న దృష్ట్యా హరిప్రసాద్ ఇన్‌ఛార్జి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించటం లాంఛనమే.

వడ్డేశ్వరం ఎస్సీ కాలనీవాసులకు వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

వడ్డేశ్వరం గ్రామ పరిధిలోని అసైన్డ్ భూమి సర్వే నంబర్ 40లో ఇళ్లేసుకున్న ఎస్సీ కాలనీలో పేదలకు మౌలిక వసతులు కల్పించాలని, పేదల ఇళ్లను రెగ్యులర్ చేసి, పట్టాలు ఇవ్వాలని సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామంలోని ఎస్సీ కాలనీలో సిపిఎం మండల కార్యదర్శి డి.వెంకటరెడ్డితో కలిసి ఆయన ఆదివారం పర్యటించారు. కాలనీలో మౌలిక వసతులపై స్థానికుల నుండి వివరాలడిగారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ 16 ఏళ్లుగా నిరుపేదలు ఇళ్లేసుకుని జీవిస్తుంటే గత టిడిపి ప్రభుత్వం కానీ, ప్రస్తుతం వైసిపి ప్రభుత్వం కానీ పేదల ఇళ్లను రెగ్యులర్ చేసి పట్టాలివ్వకుండా తాత్సారం చేశాయని విమర్శించారు. సరైన రోడ్లు, డ్రెయినేజీ కాల్వలు లేకపోవడం వల్ల ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోయి, దోమలతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని వాగ్దానం చేసిన జగన్మోహన్‌రెడ్డి ఒక్క సెంటు స్థలం కూడా పేదలకు ఇవ్వలేదని అన్నారు. మూడు రాజధానుల పేరుతో



ఎస్సీ కాలనీవాసుల సమావేశంలో మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు

రాజకీయం చేసి పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా మోసం చేశారని మండిపడ్డారు. డి.వెంకటరెడ్డి మాట్లాడుతూ తాడేపల్లి మండలంలో సుమారు మూడు వేల మందికి పైగా ఇల్లు లేని నిరుపేదలున్నారని, వీరిని టిడిపి, వైసిపి రెండూ విస్మరించాయని చెప్పారు. ఇల్లు లేని పేదలు పిడబ్ల్యూడి కాల్వ కట్టలు, కొండ పోరంబోకు, చెరువు పోరంబోకులలో ఇళ్లేసుకున్న పేదలందరికీ, పేదలు నివాసం ఉండే చోటే ఇళ్లను రెగ్యులర్ చేసి, పట్టాలివ్వాలని కోరారు. గ్రామాల్లో పేదలు ఎదుర్కొంటున్న తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ కాల్వలు, మురుగు, ఇతర సమస్యలపైనా మంగళగిరిలోని ఎంటిఎంసి కార్యాలయం వద్ద సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో మహాధర్నా చేస్తామని, ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం వడ్డేశ్వరం గ్రామ శాఖ కార్యదర్శి వి.పున్నయ్య, ఎస్కే కాసింబి, కె.సాంబశివరావు, వి.మరియబాబు, కె.స్వాతి, భ్రమరాంబ, ప్రసన్నదేవి, ఆగ్నేసమ్మ పాల్గొన్నారు.

ఎంటిఎంసి కార్యాలయం వద్ద నేడు సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎంటిఎంసి కార్యాలయం వద్ద ఆదివారం ఉదయం 10 గంటలకు జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన జారీ చేశారు. మంగళగిరి నియోజకవర్గంలో 20 వేల మంది ఇళ్ల స్థలాలు, పట్టాల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల్లో ఇళ్లేసుకుని నివాసం ఉంటున్న వారికి పట్టాలు ఇస్తామని, రెగ్యులరైజ్ చేస్తామని జీవోలు ఇవ్వడం మినహా చర్యలు మాత్రం లేవని పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ సమస్యలతో జనం సతమతమవుతన్నారని తెలిపారు. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల భూగర్భ జలాలు, పంట కాల్వలు కలుషితం అవుతున్నాయని, భూగర్భ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. అన్ని గ్రామాల్లో ఎస్సీలకు శ్మశాన స్థలాల సమస్య ఉందని, ఇటీవల సిపిఎం నిర్వహించిన పాదయాత్రలో ప్రజలు అనేక సమస్యలను తమకు నివేదించారని తెలిపారు. ఈ సమస్యలపై చేపట్టే ధర్నాలో ప్రజలంతా పాల్గొనాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్.భావన్నారాయణ

దళితుల సాగు భూముల్లో బోర్లేయాలి

ప్రజాశక్తి - కొల్లిపర

దావులూరు గ్రామంలోని గుండేరు డ్రెయిన్ భూములను సాగు చేసుకుంటున్న దళిత రైతుల భూముల్లో ప్రభుత్వం బోర్లు వేసి ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.భావనారాయణ కోరారు. ఈ మేరకు గ్రామంలో దళిత రైతులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో రైతులు మాట్లాడుతూ తమ సమస్యలను వివరించారు. కొన్నేళ్లుగా పంట కాల్వలో నీరు సరిగా రాకపోవడంతో పంటలు సాగు చేయడానికి వీల్లేకుండా పోయిందని, దీనివల్ల తామెంతో నష్ట పోతున్నామని చెప్పారు. అనంతరం భావన్నారాయాణ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం రైతులు ఐక్యంగా ఉద్యమించాలని, అందుకు సిపిఎం పూర్తి అంగా ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా ఒక కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు ఎం.శివసాంబిరెడ్డి, ఎం.సాంబశివరావు, ఎం.రాజారావు, సురేష్, జి.నాగరాజు, అంబేద్కర్ పాల్గొన్నారు.



టగ్ ఆఫ్ వార్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఎస్ఆర్ఎంలో ఉత్సాహంగా ఫ్రెషర్స్‌డే

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో అలోహ పేరుతో రెండ్రోజులపాటు నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలు ఆదివారం ముగిశాయి. వీసీ ప్రొఫెసర్ మనోజ్ కుమార్ ఆరోరా వేడుకలను ప్రారంభించగా తరగతులు, సమయ పాలన, ఇతరత్రా వివరాలను విద్యార్థులకు ప్రొఫెసర్లు వివరించారు. క్రమ శిక్షణతో చదువులు సాగించాలనీ, అంతర్జాతీయ స్థాయి విద్యాబోధనను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు వీసీ సూచించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులకు టగ్ ఆఫ్ వార్, క్లాసికల్, వెస్ట్రన్ డ్యాన్స్, సంగీతం, క్విజ్ తదితర పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. 2023 సంవత్సరానికి మిస్టర్ ఆండ్ మిస్ యూనివర్శిటీలుగా ధవ్ నారాయణ్ బజాజ్, వైష్ణవి కస్తూరిలు ఎంపికయ్యారు. కార్యక్రమంలో స్టూడెంట్ అఫైర్స్ డైరెక్టర్ అనిల్ నిగమ్, రేవతీ బాలకృష్ణన్, స్టూడెంట్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ప్రీతం, వైస్ ప్రెసిడెంట్ నిరుక్తా, ప్రధాన కార్యదర్శి సంజన, కోశాధికారి లక్ష్మణ్ పాల్గొన్నారు.

టిఫిన్ బండి అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి : తాడేపల్లి పట్టణం మహానాడుకు చెందిన శివలంకి నాగేశ్వరికి వైసిపి నాయకులు ఆదివారం టిఫిన్ బండి అందజేశారు. తన ఆర్థిక పరిస్థితిని



పట్టణ అధ్యక్షులు వేణుగోపాలసోమిరెడ్డికి తెలియజేయగా ఆయన ఎమ్మెల్యే ఆర్‌కె దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే టిఫిన్ బండిని సమకూర్చారు. కార్యక్రమంలో సిహెచ్.దుర్గారావు, సయ్యద్ సలాం, ఈశ్వరి, నాయుడు, సిహెచ్.స్వాతి, జి.సుబ్బయ్య, ఎన్.నాగమణి పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూ వాయిదా

ప్రజాశక్తి- వినుకొండ

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జంతు శాస్త్రం బోధించేందుకు అతిథి అధ్యాపక ప్రాతిపదికన భర్తీకి దర ఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ టి. ప్రభాకర రావు ప్రకటించిన విషయ తెలిసిందే. ఈ నెల 16న నిర్వహించాల్సి ఉన్న ఇంటర్వ్యూలకు ఉన్నతాధికారుల అను మతులు రానందున వాయిదా వేస్తున్నట్లు ఈ మేరకు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ విషయాన్ని అభ్యర్థులు గనించాల్సిందిగా కోరారు.



పేదలకు నిత్యావసర వస్తువుల వితరణ

ప్రజాశక్తి-వినుకొండ

ఆర్థికగా గా వెనుక బడిన పేద బ్రాహ్మణ కుటుబాలను దుకునే క్రమంలో భాగంగా ప్రతినెలా వినుకొండ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో నిత్యావవసర వస్తువులను అందజేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆదివారం జీవి మాధవరావు కార్యాలయంలో ఆరు కుటుం బాలకు బియ్యం, చీరలు అందజేశారు. పలువురు దాతల సాయంతో వీటిని అందజేశారు. అనంతరం సుదీర్ఘ కాలము నుండి సహాయ సహకారాలు అందిస్తున్న దార్వేముల ఆది చంద్ర శేఖర శాస్త్రీ ,గొర్తి నాగరాజు,మతుకుమల్లి మురళి ధర్ , పొట్లూరి వరలక్ష్మమ్మలను ఘనంగా సన్మానించారు. కార్య క్రమంలో అప్పరాజు నాగేశ్వరరావు, అన్నాప్రగడ వెంకటేశ్వర రావు , పోలూరి సుబ్బారావు , ధూళిపాళ్ళ నాగేశ్వర రావు , జే. చంద్రమోలేశ్వరరావు , చింతలపూడి భద్రయ్య , చింత కుంట శంకరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మురికిపూడి దేవపాల్

ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ను పునరుద్ధరించండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఒవర్సీస్ స్కాలర్ షిప్ పున రుద్ధరించాలని మేడ్ రాష్ట్ర అధ్యక్షులు మురికిపూడి దేవపాల్ డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట ఎన్జీఓ హోమ్ లో ఆదివారం మేడ్ పల్నాడు జిల్లా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి గద్దల అసుదాసు అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా మురికిపూడి దేవపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో దళిత విద్యార్థులు విదేశాలలో ఉన్నత చదువులు చదువు కోవాలనే వారి ఆశలు జగనన్న విదేశి విద్య ద్వారా నెరవేరటంలేదన్నారు. దానికి ఉదా హరణ ఈ మధ్యకాలంలో విడుదల చేసిన జగనన్న విదేశీ విద్య నిధుల ద్వారా ఎంత మంది దళిత విద్యార్దులకు అవ కాశం వచ్చిందో చూస్తే అర్థమవుతుం దన్నారు. జగనన్న విదేశీ విద్య పథకం అమలు చేస్తునే దళిత విద్యార్థులకు ప్రత్యేకంగా అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళిత విద్యార్థులకు అంబే ద్కర్ ఓవర్ సీస్ స్కాలర్ షిప్ సాధన కోసం, మేడ్ సంఘాన్ని బలోపేతం చేయడంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి జిల్లా, నియోజకవర్గ కమీటిలను వేసి సంఘాన్ని బలపరచే ప్రయత్నం చేస్తున్నామన్నారు. పల్నాడు జిల్లాలోని 7 నియోజకవర్గాలకు నూతన అధ్యక్ష కార్యదర్శులను నియమాకం చేశారు.

నేటి నుండి ఇవిఎంలు, వివి ప్యాట్స్‌ల మొదటి దశ తనిఖీ

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

ఎఫ్ఎల్సిపై సన్నద్ధతపై సమీక్షలో కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఈ నెల 16వ తేదీ నుండి నవంబర్ 20వ తేదీ వరకు ఈవీఎంలు, వివి ప్యాట్స్ ల ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో పగడ్బంది ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని స్పందన హాలులో ఆదివారం మధ్యాహ్నం ఈవీఎంలు, వివి ప్యాట్స్ ల ఫస్ట్ లెవెల్ చెకింగ్ (ఎఫ్ఎల్సి)పై సన్నద్ధత, తదితర అంశాలపై సమీక్ష, తహశీల్దార్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ ఈ కార్యక్రమం ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు జరుగుతుందని చెప్పారు. 24 టేబుల్స్ ఏర్పాటు చేస్తారని, ఆయా టేబులల్లో డిటి, పంచాయతి కార్యదర్శి, కంప్యూటర్ ఆపరేటర్ ఉం డాలని తెలిపారు. బెల్ కంపెనీ నుంచి 12 మంది ఇంజనీర్లు కూడా రానున్నారని అన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల జిల్లా అధ్యక్షులు నుంచి ఫొటోలతో ఆథరైజేషన్ లెటర్ తీసుకురావాలని, వారికి మాత్రమే ఫస్ట్ లెవెల్ చెకింగ్ కి ప్రవేశం ఉంటుందని, ఈ విషయం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు తెలియజేయాలని చెప్పారు. ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు త్వరగా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం,ఆర్డిఓ ఎం.శేషిరెడ్డి పాల్గొన్నారు.

ఇవిఎం, వివిపాట్స్ కేంద్రంలో తనిఖీ

నరసరావుపేట మార్కెట్ యార్డులో భద్రపరిచిన ఎలక్షన్ సామాగ్రిని కలెక్టర్ శివశంకర్ ఆదివారం తనిఖీ చేశారు. ఎలక్షన్ ఆఫీసర్ తరహాలో మార్కెట్ యార్డులోని ఇవిఎం వివి ప్యాడ్ భద్రపరిచిన కేంద్రాన్ని ఆయనతనిఖీ చేశారు. 2024 – ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల అధికారులు అన్ని సామాగ్రిని సన్నద్ధం చేయాలని ఇవిఎం, వివి ప్యాట్లు అన్ని సక్రమంగా సరిపడా ఉన్నాయా లేదా అని గమనించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు , జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం,ఆర్డీఓ ఎం. శేషిరెడ్డి, తహ శీల్దార్ రమణ నాయక్ ఆయా శాఖల అధికారులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన డి.ఆర్.ఓ, ఆర్డీఓ తదితరులు



సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు



మార్కెట్ యార్డులో భద్రపరిచిన ఎలక్షన్ సామాగ్రిని తనిఖీ చేస్తున్న కలెక్టర్

ఇచ్చిన మాటను మంత్రి నిలబెట్టుకోవాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



సాగుకు పూర్తి స్థాయిలో నీరు ఇవ్వలేమని, రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని చెప్పిన జిల్లాకు చెందిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మాట నిలబెట్టుకోవాలని ఆంధ్రరాష్ట్ర సాగర్ జలాల వినియోగంపై తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి డెడ్ స్టోరేజ్ ఉన్న నీటిని తోడి తక్షణమే పంటలకు అందించాలని పిడిఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. నరసరావుపేట మండలంలోని జొన్నలగడ్డ , పరిసర గ్రామాలలో గల పంట పొలాలను పిడిఎం నాయ కులు ఆదివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నరస రావుపేట ప్రాంతంలో మిర్చి, పత్తి, కంది తదితర పంటలు నీళ్ల లేక, వర్షాలు లేక ఎండు ముఖం పట్టిన పంట పొలాలను చూసి ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎండ వేడిమికి వాగులు చెరువులు కూడా ఎండిపోయి చుక్క నీరు దొరక్క రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. జొన్నలగడ్డ గ్రామానికి చెందిన రైతు కొరిటాల శ్రీనివాసరావు ఎకరానికి ఇప్పటికే రూ 70 వేలకు పైగా పెట్టుబడి పెట్టామని నీళ్ల లేక మొక్కలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశా రన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఆరుతడి పంటలకు నీళ్ల విడుదల చేయాలని, పంటలను కాపా డాలని, పల్నాడు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని రైతులను అన్ని రకాలుగా ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పిడిఎం నాయకుల నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, బీసీ నాయకులు బాగున్నల శ్రీనివాసరావు, సిఎల్సి నాయకుడు శిఖినం చిన్నా తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-అమరావతి

అమరావతిలోని శ్రీ బాల చాముండికా సమేత అమరేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆదివారం నుండి శ్రీదేవి శరన్నవరాత్ర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు బాల చాముండికా అమ్మవారిని శ్రీ రజిత కవ చలంకత దేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వహణాధికారి వేమూరి. గోపీనాదశర్మ మాట్లా డుతూ ప్రతిరోజు చండీ హోమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-క్రోసూరు

అనారోగ్యంతో బాధపడుతున్న జడ్పిటిసి, క్రోసూరు వైసిపి నాయకులు గఫూర్ భార్య, జమీలను ఎమ్మెల్యే నం బూరు శంకరరావు ఆదివారం పరామర్శించారు. గుంటూరులోని అంజలి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఆమెను కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు.

జీవనశైలి మార్పులతోనే ఇఎన్‌టి సమస్యలు

ప్రొఫెసర్ యు . శ్రీనివాసరావు

ప్రజాశక్తి-గుంటూరు సిటి

మారుతున్న జీవన శైలిలో మార్పు కారణంగానే చిన్న పెద్ద అనే తేడా లేకుండా చెవి ,ముక్కు, గొంతు సమస్యలతో నిత్యం వందలాదిమంది ప్రజలు జనరల్ ఓ పి ద్వారా గుంటూరు సర్వజన ప్రజా వైద్యశాల లోని ఈ.యన్.టి విభాగాన్ని సంప్రదిస్తుండగా, వైద్య పరీక్షల అనంతరం శాస్త్ర చికిత్సలు జిజిహెచ్ లోనే నిర్వహిస్తున్నట్లు, ఎన్.టి విభాగం రెండో యూనిట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ యు. శ్రీనివాసరావు తెలిపారు. ఈ.ఎన్.టి విభాగం నెలకు 200 పైగా చెవి, ముక్కు , గొంతు సమస్యలపై పలు రకాల ఆపరేషన్లను జిహెచ్ లో నిర్వహిస్తున్నారు పార్టీలో వినిపించే డిజె సౌండ్ పరిధికి మించి ఉండడంతో పలు రకాల చెవిలకు సంబంధించిన వ్యాధులకు కారణంగా మారు తుందన్నారు. ఎక్కువమంది ఇయర్ మైక్రో సర్జరీ, రీకన్‌స్ట్రక్టివ్ మిడిల్ ఇయర్ సర్జరీ, ఇయర్ రికన్‌స్ట్రక్టివ్ సర్జరీ, లాలాజల గ్రంథి సర్జరీ, తల ,మెడ నొప్పి, అడెనాయిడ్ టాన్సిల్ సర్జరీ, ఫంక్షనల్ ఎండోస్కోపిక్ సైనస్ సర్జరీ – ఫెస్, సర్జరీ ముఖ నరాల, చెవి ఇన్ఫెక్షన్, కోక్లియర్ ఇంప్లాంట్స్, స్పీచ్ బలహీనత, చెవి మైనం (సెరుమెన్) తొలగింపు, పుట్టుకతో వచ్చే చెవి సమస్య చికిత్సలు, వెర్టిగో/మైకము , స్వచ్ఛమైన టోన్ ఆడియోమెట్రీ. సమస్యలతో వస్తున్న వారికి మైక్రోస్కోప్, బేవి, ఎండోస్కోపీ పరికరాల ద్వారా టెస్టులు నిర్వహించి అవసరమైన వారికి శాస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు.వీరిలో ఎక్కువమంది టాన్సిల్స్ వాపుతో జిజిహెచ్ కు వస్తున్నట్లు తెలిపారు.

త్వరలో జి జి హెచ్ లో కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీలు

ఎంతో క్లిష్టమైన మరెంతో ఖర్చుతో కూడుకున్న చర్మం లోపల అమర్చే కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీలను జిజిహెచ్ లో త్వరలో నిర్వహించినట్లు డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. వాటికి అవసరమయ్యే అధునాతన వైద్య పరికరాలైన ఆబ్లేటర్, లేజర్, మైక్రో డీబ్రేటర్ కోసం ఆసుపత్రి పరిపాలనాధికారి వై కిరణ్ కుమార్ కలెక్టర్ కు నివేదిక పంపినట్లు తెలిపారు. అన్ని సజావుగా సాగితే త్వరలోనే కార్పొరేట్ హాస్పిటలకు దీటుగా అత్యుత్తమ వైద్యాన్ని జిటిహెచ్ లో అందిస్తామన్నారు.కోక్లియర్ ఇంప్లాంట్ మైక్రోఫోన్ ద్వారా సౌండ్ సిగ్నల్‌లను



తీసుకుంటుదాని, వాటిని విద్యుదయస్కాంత సంకేతాలుగా మారుస్తుందన్నారు. ఈ విద్యుదయస్కాంత సంకేతాలు చర్మం లోపల అమర్చిన కోక్లియర్ ఇంప్లాంట్‌కు విద్యుదయస్కాంత కాయిల్ కోయిల్ ద్వారా సంకేతాలు పంపబడతాయన్నారు. ఒక కోక్లియర్ ఇంప్లాంట్ చికిత్స లో రెండు పరికరాలను కలిగి ఉంటుందని. ఒక భాగం బయటకు ఉండగా, మరొక భాగం తల లోపల శస్త్రచికిత్స ద్వారా అమర్చబడుతుందన్నారు.

వేధిస్తున్న సిబ్బంది, కార్మికుల కొరత

- తొమ్మిది శానిటరి డివిజన్లకు ముగ్గురే ఇన్‌స్పెక్టర్లు
- హెల్త్ ఇన్‌స్పెక్టర్లకు తప్పని అదనపు బాధ్యతలు
- శాశ్వత ప్రాతిపదికన 80 మంది కార్మికులే

ప్రజాశక్తి-తెనాలి

పట్టణ పరిశుభ్రత, పారిశుధ్యం మెరుగులో కీలకంగా ఉన్న ప్రజారోగ్య విభాగాన్ని సిబ్బంది కొరత వేధిస్తోంది. దీనికితోడు పారిశుధ్య కార్మికుల కొరత మరింత ఇబ్బందికరంగా ఉంది. దాదాపు రెండు లక్షల జనాభా కలిగి, సమీపంలోని పది మండలాలకు కేంద్ర బిందువుగా ఉన్న స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీకి పారిశుధ్యం నిత్యం సవాలుగా మారింది. స్వచ్ఛభారత్, స్వచ్ఛ సర్వేక్షణ్, స్వచ్ఛతాహి సేవ, స్వచ్ఛ తెనాలి.. ఇలా రకరకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నా సిబ్బంది కొరత ప్రభావం మాత్రం ఉన్న కొద్దిమందిపై పడుతోంది.

తెనాలి పట్టణ జనాభా రెండు లక్షల వరకు ఉండగా 40 వార్డులున్నాయి. సమీప గ్రామాల నుంచి వివిధ పనులు, ఉద్యోగాలు, వ్యాపారాల నిమిత్తం తెనాలికి ప్రతిరోజూ దాదాపు 40 వేల మంది వచ్చిపోతుంటారు. దీంతో పారిశుధ్యం అనేది ఎంతో కీలకమైన అంశం. కార్మికులు ఎంత శ్రమిస్తున్నా పట్టణంలో ఏదో ఒక మూల సమస్యలు ఎదురవుతూనే ఉన్నాయి. పారిశుధ్య నిర్వహణకు పట్టణానికి సంబంధించి తొమ్మిది శానిటరీ డివిజన్లు ఉన్నాయి. వీటికి 9 మంది శానిటరీ ఇన్‌స్పెకర్టు ఉండాల్సి ఉన్నా ప్రస్తుతం ముగ్గురే ఉన్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలో ఉన్న ఐదుగురు హెల్త్ ఇన్‌స్పెక్టర్లకు శానిటరి ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జి బాధ్యతలు కూడా నిర్వహించాల్సి వస్తోంది. వాస్తవానికి ఆయా ఖాళీల భర్తీపై ప్రభుత్వ నిషేధం అమల్లో ఉన్న దృష్ట్యా కనుచూపు మేరలో హెల్త్ ఇన్‌స్పెక్టర్, శానిటరి ఇన్‌స్పెక్టర్ పోస్టులు భర్తీ అయ్యే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. ఫలితంగా శానిటరి ఇన్‌స్పెక్టర్లకు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లకు పనిభారం తప్పటం లేదు.

వెంటాడుతున్న పారిశుధ్య కార్మికుల కొరత



రజకచెరుకులో వ్యర్థాలను తొలగిస్తున్న కార్మికులు

పురపాలక సంఘంలో పారిశుధ్య కార్మికుల కొరత కూడా ఉంది. మొత్తం తొమ్మిది శానిటరి డివిజన్లలో ప్రస్తుతం శాశ్వత ప్రాతిపడికన పనిచేసే కార్మికులు కేవలం 80 మంది మాత్రమే ఉన్నారు. గతంలో దాదాపు 140 మంది వరకూ ఉండేవారు. అయితే కాలక్రమంలో ఉద్యోగ విరమణ చేయటంతో అ సంఖ్య 80కి పడిపోయింది. నిబంధనల ప్రకారం ఒక్కో కార్మికుడు రోజుకు 750 మీటర్లు శుభ్రం చేయాల్సి ఉంది. దీంతో ఏపి ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ద్వారా 322 మంది పారిశుధ్య కార్మికులను నియమించారు. అయినా సీజనల్‌గా కార్మికుల కొరత తీరనిదే. వర్షాకాలంలో పారిశుధ్యం మెరుగు పరచటం



సైడ్ డ్రెయిన్లలో వ్యర్థాల తొలగింపు

కార్మికులకు సవాలుగానే ఉంది. ఈ నేపథ్యంలో 40 మందిని సీజనల్‌గా నియమించి పారిశుధ్య విధులకు కేటాయిస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఖాళీ నివేశన స్థలాల్లో నీరు నిలిచి, చెట్లు పెరిగి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఇది చుట్టపక్కల నివసించే వారికి ఇబ్బందికరంగా ఉంది. అలాంటి స్థలాలను గుర్తించి వాటి యజమానులకు పురపాలక సంఘం ద్వారా నోటీసులిస్తున్నారు. అప్పటికీ స్పందించకుంటే పురపాలక సంఘం తరపునే కార్మికులను కేటాయించి, వాటిని తొలగింపచేసి బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.

అయినా అలసత్వం లేదు

పారిశుధ్య విభాగంలో సిబ్బంది, కార్మికుల కొరత ఉంది. తొమ్మిది శానిటరి డివిజన్లకు ముగ్గురే ఇన్‌స్పెక్టర్లున్నారు. వీరితోపాటు మున్సిపాల్టీలోని ఐదుగురు హెల్త్ ఇన్‌స్పెక్టర్లకు ఇన్‌చార్జి బాధ్యతలు కేటాయించాం. కార్మికుల కొరత కూడా ఉంది. ప్రస్తుతం శాశ్వత ప్రాతిపకన 80 మంది మాత్రమే ఉన్నారు. వారికితోడు ఆప్కాస్ ద్వారా 322 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి అదనంగా మరో 40 మందిని సీజనల్‌గా నియమించుకుని పారిశుధ్యం మెరుగుకు అసత్వం లేకుండా కృషి చేస్తున్నాం.



డాక్టర్ కె.హెలెన్‌నిర్మల, మున్సిపల్ ఆరోగ్యాధికారి, తెనాలి.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

అంగలకుదురు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1986-87 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో జరిగిన సమ్మేళనంలో ఆనాటి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పాఠశాలలో నిర్మించతలపెట్టిన సైకిల్ స్టాండ్‌కు అయ్యే రూ.3 లక్షలను తామే సమకూరుస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా విశ్రాంత ఉపాధ్యాయులు కె.వెంకట అప్పారావు, ఎన్.వీరాస్వామి, హరిప్రసాద్, పరంధామయ్య, ధర్మమేశ్వరి, హేమలత, ప్రస్తుత హెచ్‌ఎం ఎం.అనురాధను సన్మానించారు. కార్యక్రమంలో సూర్య వెంకట్రావు, జె.వెంకటేశ్వర్లు, కె.శ్రీధర్, ఎం.రామయ్య, ఎం.రాధిక, జి.పద్మ, బి.తులసిరాణి, శేషశ్రీ, కె.సుజాత పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం గుంటూరు నగర అధ్యక్షులుగా కెవి భాస్కర్

ప్రజాశక్తి - మంగళగిరి

బీసీ సంక్షేమ సంఘం గుంటూరు నగర అధ్యక్షులుగా కె.వి భాస్కర్, గుంటూరు నగరం మైనార్టీ అధ్యక్షులుగా షేక్ నాగుల్ మీరాను నియమిస్తూ ఆది వారం మంగళగిరిలోని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.శంకర్రావు, యువ జన సంఘం అధ్యక్షులు కె.క్రాంతికుమార్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పి.మహేష్ పాల్గొన్నారు.

ప్రపంచ ప్రయోజనం బాపిరాజు కవిత్వం

ప్రజాశక్తి-గుంటూరు

అడివి బాపిరాజు కవిత్వంలో ప్రకృతి వర్ణనలు ప్రత్యేకమని, ప్రకృతి వర్ణనలలో కూడా ప్రపంచ ప్రయోజనం కనిపిస్తుందని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి అన్నారు. గుంటూరు బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో అమరావతి సాహితీ మిత్రులు నిర్వహించిన ఆదివారం కార్యక్రమంలో ఆమె 'అడివి బాపిరాజు కవిత్వం' గురించి మాట్లాడారు. గొప్ప నవలా రచయితగా, చిత్రసీమలో గొప్పకళా దర్శకులుగా విభిన్న రీతులలో విశేష కృషి చేసిన అడివి బాపిరాజు కవిత్వం కూడా చాలా అందంగా, రమణీయంగా రాశారన్నారు. రైతుల గురించి, యానాదుల గురించి, పీడితుల గురించి కవిత్వం రాశారని తెలిపారు. యర్రగుంట్ల పాణీరావు అధ్యక్షత వహించిన సభలో శ్రీశ్రీ సమకాలికుడు శిష్టా ఉమామహేశ్వరరావు రచన 'సిపాయి కథలు' గురించి డాక్టర్ యలవర్తి భవాని మాట్లాడారు.



కనగాల జయకుమార్‌కు సన్మానం చేస్తున్న సంస్థ సభ్యులు

కొంతకాలం మిలిటరీలో పనిచేసిన ఉమామహేశ్వరరావు సిపాయిల సమస్యల్ని, మనస్తత్వాన్ని, ఇబ్బందుల్ని చక్కని హాస్యశైలిలో చిత్రించారన్నారు. కార్యక్రమంలో 'ఈ మాసం కవి'గా ప్రముఖ సినీ రచయిత కనగాల జయకుమార్ పాల్గొన్నారు. సంస్థ కన్వీనర్ పింగళి భాగ్యలక్ష్మి నిర్వహించిన కవి సమ్మేళనంలో డాక్టర్ ఆర్.వెంకటేశ్వరశర్మ, ఇ.చంద్రయ్య, గడల శివప్రసాద్, వి.వి.రావు, బి.జమదగ్ని, సత్యవతి, ఎం.వెంకట గురువు పాల్గొన్నారు. అనంతరం కనగాల జయకుమార్‌ను సన్మానించారు.

శ్యామసుందరరావుకు నివాళులు

ప్రజాశక్తి - మంగళగిరి

సిపిఐ నాయకులు వుడతా శ్యామసుందరరావు సంతాప సభ స్థానిక ఇందిరా నగర్‌లోని సిపిఐ కార్యాలయం వద్ద ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, వైసిపి చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షులు గంజి చిరంజీవి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు కుమ్మరి క్రాంతి కుమార్, సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, వివిధ పార్టీల నాయకులు, వివిధ రంగాల ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, వీజే విద్యాసంస్థల డైరెక్టర్ పి.రాజశేఖర్, కె.శ్రీనివాసరావు, ఎన్.బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి : పట్టణంలోని 60 మంది పేద విద్యార్థులకు అంజుమన్-ఈ-ఇమాయితుల్ ఇస్లాం ఆధ్వర్యంలో స్థానిక గౌతమ్ బుద్ధ రోడ్డులోని షాదీఖానాలో ఆదివారం స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. ఎంహెచ్‌పిఎస్ పార్టీ అధ్యక్షులు ఫరూక్ షిబ్లీ, అంజుమన అధ్యక్షులు షేక్ అక్రమ్, ఇస్లామిక్ ఫ్రంట్ అధ్యక్షులు షేక్ రియాజ్, కార్యదర్శి అనిఫ్ కాదరి, టిడిపి నాయకులు పి.శ్రీనివాసరావు, అంజుమన్ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు పాల్గొన్నారు.





సమావేశంలో పాల్గొన్న సభ్యులు

కథ, కవిత కార్యశాలల నిర్వహణకు కృషి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక విజయపురి కాలనీలోని జిల్లా రచయితల సంఘం కార్యాలయంలో ఆదివారం సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి సోమేపల్లి వెంకటసుబ్బయ్య అధ్యక్షత వహించి మాట్లాడారు. భవిష్యత్తులో సంఘం చేపట్టే పలు కార్యక్రమాల గురించి చర్చించారు. కథ, కవిత కార్యశాలల నిర్వహణతో పాటు, యువ రచయితలను ప్రోత్సహించేలా కవి సమ్మేళనాలు, రచనలో మెలకువలు నేర్పేలా గతంలో నిర్వహించిన 'ప్రతిమాసం-రచన కోసం 'కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించాలని నిర్ణయించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం. సుభాని ఉపాధ్యక్షులు డాక్టర్ నాగరాజ్యలక్ష్మి, బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి, కోశాధికారి ఎన్.వి. సత్యనారాయణ, డాక్టర్ ఎం.లలితకుమారి పాల్గొన్నారు. అనంతరం సభ్యులందరికి సంఘ గుర్తింపు కార్డులు అందచేశారు.

దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లి సెంటర్‌లో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో లలిత ప్రాంగణంలో ఆదివారం నుండి దేవీశరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి. ఆదివారం బాలాత్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. ప్రతిఏటా లింగంశెట్టి అసోసియేట్స్ ఆధ్వర్యంలో లింగంశెట్టి కిషోర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం ఉదయం అమ్మవారి కలశ స్థాపనతో శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభయ్యాయి. సందర్శకులకు ప్రసాదాల పంపిణీని దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ నేరెళ్ల లక్ష్మీ రాధిక, మురళి దంపతులు ప్రారంభించారు.

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్

స్థానిక శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవాలయంలో దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. నవరాత్రుల మొదటి రోజు బాల త్రిపుర సుందరి దేవి అలంకారంలో శ్రీ భ్రమరాంబ అమ్మవారు దర్శనం ఇచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు తెలిపారు.



50 మంది వృద్ధులకు కళ్లజోళ్లు

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణంలోని రామనాథం చినకోటయ్య శివపార్వతమ్మ వృద్ధుల సేవాశ్రమంలో నిర్వహిస్తున్న వృద్ధులకు నిత్య అన్నదానం' ఉచిత సేవా కార్యక్రమం రెండవ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఆశ్రమ అధ్యక్షులు రామనాథం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 101వ ఉచిత కంటివైద్యశిబిరం ఏర్పాటు చేయగా ముఖ్యఅతిథిగా వైసిపి నాయకులు, జెసిఎస్ కన్వీనర్ మహ్మద్ ఫిరోజ్ హాజరై 50 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఎ.శంకర్రావు, కె.శ్యామలరావు, ఆర్.శివకుమార్ పాల్గొన్నారు.

సిపిఎస్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-గుంటూరు



కోటేశ్వరరావు, రవితేజ

ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ అసోసియేషన్ గుంటూరు, పల్నాడు జిల్లాల నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక జలవనరుల శాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గుంటూరు జిల్లా అధ్యక్షులుగా మోపిదేవి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పెరవలి రవితేజ ఎన్నికయ్యారు. పల్నాడు జిల్లా అధ్యక్షులుగా ఉబేదుల్లా బేక్, ప్రధాన కార్యదర్శిగా పోలూరి పిచ్చయ్య ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కె.పార్థసారథి, బాజీ పఠాన్, సుదర్శనం రత్తయ్య వ్యవహరించారు. పార్థసారథి మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఒపిఎస్ పునరుద్ధరిస్తారని హామీ ఇచ్చి మోసం చేసిందని, ఎవరైతే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని స్పష్టమైన హామీ ఇస్తారో వారికే వచ్చే ఎన్నికల్లో సిపిఎస్ ఉద్యోగుల మద్దతు ఉంటుందని చెప్పారు. దానిపై భవిష్యత్ కార్యాచరణను చేపట్టబోతున్నట్లు తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన ఎస్ఐ రాత పరీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు సిటి

గుంటూరు రేంజ్ పరిధిలో ఎస్ఐ పోస్టులకు రాష్ట్ర పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ ద్వారా నగరంలోని పలు కళాశాలల్లో రెండ్రోజులుగా నిర్వహిస్తున్న తుది రాత పరీక్షలు ఆదివారం ముగిశాయి. 99 శాతం మంది హాజరైనట్లు ఐజి పాల్‌రాజు తెలిపారు. పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించామని చెప్పారు. ఇందుకు సహకరించిన గుంటూరు జిల్లా ఎస్పీ అరిఫ్ ఆఫీజ్‌తో పాటు పోలీస్ ఉన్నతాధికారులను అభినందించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) సుప్రజ, ఈస్ట్ ఎఎస్పీ నిసికేట్ సెల్కి, వెస్ట్ డివిజన్ డిఎస్పి ఉమామహేశ్వరరెడ్డి, ట్రాఫిక్ డిఎస్పి బాలసుందరరావు, స్పెషల్ బ్రాంచ్ సిఐ బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

పైరుకు సెలైన్ ఎక్కించినట్టే నీరు

- తీవ్రంగానే సాగునీటి ఎద్దడి
- రబీలో ఆరుతడి పంటలే వేయండి
- జొన్న, మొక్కజొన్నకు వెళ్లద్దు
- మినుము, పెసరకు ప్రాధాన్యమివ్వాలి

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పైర్లను కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎన్.వెంకటేశ్వర్లు చెప్పారు. ప్రస్తుతం వరి, పత్తి, మిర్చి పైర్లు వివిధ దశల్లో ఉన్నాయని, వర్షాభావం వల్ల నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న దృష్ట్యా నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని రైతులను కోరారు. ప్రస్తుతానికి పంటలకు ఇబ్బంది లేదన్నారు. రబీలో పూర్తిగా ఆరుతడి పంటలను మాత్రమే సాగు చేసుకోవాలని సూచించారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.





జిల్లాలో వరి ఏ దశలో ఉంది?

జిల్లాలో 1.40 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ప్రస్తుతం పొట్ట దశలో ఉంది. త్వరలో పాలుపోసుకునే దశలో చేరుకుంటున్నందున ప్రస్తుతం నీటి అవసరం ఎంతో ఉంది. ప్రస్తుతం డెల్టా పరిధిలో కాల్వలకు నీరు విడుదల చేస్తున్నారు. ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి. చివరి భూములకు నీరు లభ్యమయ్యేలా నీటి పారుదలశాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. నీటి ఎద్దడి అంశాన్ని ఎప్పటికప్పుడు నీటి పారుదల అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నాం.

పత్తి పరిస్థితి ఏమిటి?

జిల్లాలో 45 వేల ఎకరాల్లో పత్తి సాగైంది. ప్రస్తుతం మొదటి దశ తీతలకు చాలా ప్రాంతాల్లో పైరు సిద్ధంగా ఉంది. పత్తికి కాయలు, పూత బాగా వచ్చాయి. కొద్దిరోజుల్లోనే మొదటి తీతలు ప్రారంభమవుతాయి. కనీసం 4 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. పత్తికి కూడా వర్షాభావం ఏర్పడింది. కనీసం ఒకటి రెండు వర్షాలు పడితే పత్తి పూర్తి స్థాయిలో దిగుబడి సాధించేందుకు అవకాశం ఉంటుంది.

మిర్చి సాగు ఎలా ఉంది?

జిల్లాలో దాదాపు 25 వేల ఎకరాల్లో మిర్చి సాగైంది. మిర్చికి నీటి అవసరం ఉంది. బెట్టకు రాకుండా రైతులు ఇప్పటికప్పుడు యూరియా ఎకరానికి ఒక కిలో, లేదా పొటాషియం నైట్రేట్ ఒక కిలో నీటిలో కలిపి పిచికారి చేయాలి. మనిషికి సిలైన్ ఎక్కించినట్టు పైరును బతికించుకునేందుకు ఈ విధంగా ప్రయత్నించాలి.

జిల్లాలో ఇతర పంటల సాగు ఎలా ఉంది?

మినుము 6250, సోయాబిన్ 1250, పసుపు 3750 ఎకరాల్లో సాగయ్యాయి. వర్షాభావం వల్ల కొంత ఇబ్బంది ఉన్నా గతనెలలో కురిసిన వర్షాలతో ప్రస్తుతం ఆశాజనకంగా ఉన్నాయి.

ప్రస్తుతం పంటలపై తెగుళ్ల ప్రభావం?

జిల్లాలో ఎక్కడా తెగుళ్ల ప్రభావం కన్పించడం లేదు. గత నెలలో వరిపై ఆకుముడత తెగులు కన్పించినా ప్రస్తుతం తొలగిపోయింది. ఎండల తీవ్రతకు తెగుళ్ల తీవ్రత తగ్గింది.

రబీలో ఏయే పంటలు వేసుకోవాలి?

ప్రస్తుతం ఖరీఫ్‌లో వర్షాభావం, జలాశయాల్లో నీటి నిల్వలు పెరగకపోవడం, ఎగువ నుంచి నీరు రాకపోవడం వల్ల రబీలో తప్పని సరిగా ఆరుతడి పంటలు వేసుకోవాల్సిందే.జొన్న, మొక్కజొన్న సాగు చేసినా రాబోయే రెండు నెలల్లో వర్షాలు రాకపోతే ఇబ్బందులు తప్పకపోవచ్చు. అందువల్ల మినుము, పెసర సాగుకు రైతులు మొగ్గు చూపాలి. వర్షాలు కురిసినా జలాశయాల్లో నీరు లేకపోవడం వల్ల సాగు నీరు వచ్చే అవకాశాలు తగ్గిపోతున్నాయి.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ప్రభుత్వానికి ప్రజలు ఎన్నికల్లో షాక్ ఇస్తారు





గుంటూరులో ప్రజాబ్యాలెట్‌ను నిర్వహిస్తున్న వామపక్షాలు, నరసరావుపేటలో ఓటేస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు

ప్రజాశక్తి-గుంటూరు

వైసిపి ప్రభుత్వానికి ప్రజలు షాక్ ఇచ్చే సమయం ఆసన్నమైందని సిపిఎం, సిపిఐ నగర కార్యదర్శులు కె.నళినీకాంత్, కె.మాల్యాద్రి అన్నారు. ప్రజలపై మోసిన విద్యుత్ చార్జీల భారాన్ని వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో ఆదివారం శంకర్‌విలాస్ సెంటర్, కొరిటపాడు పార్కు వద్ద ప్రజాబ్యాలెట్ నిర్వహించారు. రాష్ట్రంలో 30 ఏళ్లపాటు వ్యవసాయానికి విద్యుత్ అందించే ఒప్పందం అదానీతో చేసుకున్నారని, విదేశాల నుండి బొగ్గు సరఫరా చేసే ఓడరేవులూ అదానీవేనని, తాజాగా విద్యుత్ స్మార్ట్ మీటర్ల తయారీ కంపెనీ కూడా అదానీ ప్రారంభించాడని అన్నారు. విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కేంద్రం యత్నిస్తోందని చెప్పటానికి ఇవే ఉదాహరణలన్నారు. రెండు మూడు రూపాయాలకు కొనాల్సిన యూనిట్ విద్యుత్‌ను బహిరంగ మార్కెట్లో రూ.10 నుండి రూ.20కు కొంటున్నారన్నారు. ఇందులో భారీగా అవినితి చోటు చేసుకుందని, పైగా పెరిగిన విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపుతున్నారని మండిపడ్డారు. ఇటీవల హిందూజా సంస్థలకు నిబంధనలకు విరుద్ధంగా రూ.1200 కోట్ల అప్పనంగా చెల్లించారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీలకు ఇస్తున్న ఉచిత విద్యుత్‌ను నీరుగారుస్తున్నారని విమర్శించారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని, లేకుంటే గతప్రభుత్వాలకు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు వి.రాధాకృష్ణమూర్తి, కె.రంగారెడ్డి, మురళి, ఎన్.చిన్న, సిపిఎం నాయకులు షేక్ ఖాసింషహీద్, ఆది నికల్సన్, కార్తీక్, ఖాసింవలి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నరసరావుపేట

పట్టణంలోని గాంధీ పార్క్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో ప్రజాబ్యాలెట్ నిర్వహించారు. ప్రజలు విరివిగా పాల్గొని ఛార్జీలకు వ్యతిరేకంగా ఓటేశారని సిపిఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు తెలిపారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, నాయకులు కె.బ్రహ్మయ్య, వి.రవి, న్యాయవాది సీజే ప్రతాప్ హాజరయ్యారు. సిపిఐ పట్టణ కార్యదర్శి వి.వెంకట్, నాయకులు యు.రంగయ్య, డి.వరహాలు, సైదా, వెంకటేశ్వర్లు, ఏసు, నాగేశ్వరావు, అప్పారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



4 యూనిట్లకు రూ.383 బిల్లు!

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రజలపై ప్రభుత్వం మోపుతున్న విద్యుత్ భారాల తీవ్రతకు నిదర్శనంగా పట్టణంలోని షరాఫ్ బజార్లో ఉండే జె.చలపతిరావుకు వచ్చిన కరెంటు బిల్లు నిలుస్తోంది. గత నెలలో వీరి కుటుంబం వేరే ఊరు వెళ్లిన కారణంగా నాలుగు యూనిట్ల విద్యుత్‌నే వాడుకున్నారు. అయితే బిల్లు మాత్రం రూ.383 వచ్చింది. ఇందులో టెంపరరీ ఛార్జీ రూ.7.60 కాగా ఎఫ్‌పిపిసిఎ ఛార్జి రూ.231, ట్రూ ఆఫ్ చార్జీ రూ.97, ఇతర ఛార్జీలు కలిపి రూ.383 బిల్లు వచ్చింది.

ముగిసిన డిఆర్ఎం కప్ క్రీడలు

ప్రజాశక్తి-గుంటూరు

విజేతలకు ట్రోఫీ అందచేస్తున్న డిఆర్ఎం తదితరులు



గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో మొదటిసారిగా నిర్వహించిన డిఆర్ఎం కప్ క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. స్థానిక నల్లపాడులోని రైల్వే మైదానంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. చివరి రోజు నిర్వహించిన క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో డిఆర్ఎం జట్టు, పల్నాడు పోలీసు జట్టు తలపడగా డిఆర్ఎం జట్టు విజయం సాధించింది. ముగింపు కార్యక్రమంలో డిఆర్ఎం రామకృష్ణ మాట్లాడుతూ ఆటల్లో పాల్గొనటం పరస్పర అనుబంధాన్ని మెరుగుపరచటమే కాకుండా, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం, సంస్థాగత నైపుణ్యాలను కూడా మెరుగుపరుస్తుందని చెప్పారు. సెంట్రల్ జిఎస్‌టి కమిషనర్ సాధు నరసింహారెడ్డి మాట్లాడుతూ అధికారులు, ఉద్యోగుల ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసానికి సహాయపడే ఇటువంటి క్రీడలను రైల్వే నిర్వహించటం అభినందనీయమన్నారు. అనంతరం క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్, వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో మహిళా సంక్షేమ అధ్యక్షులు ఆశాలత, ఎడిఆర్ఎం కె.సైమన్, సీనియర్ డిసిఎం ఓం.దినేష్‌కుమార్, సీనియర్ డిఎస్‌టిఇ బి.లక్ష్మణ్ పాల్గొన్నారు.